# సింగరేణీయుల సమాచారం

● ఒకే కుటుంబం ● ఒకే లక్ష్యం ● ఒకే గమ్యం... ● ఇదే సింగరేణి స్ఫూర్తి








# ఉజ్జ్వల భవిష్యత్తుకు సమిష్టి ప్రతిన










# ప్రపంచీకరణ నేపథ్యంలో మన బాధ్యత ఏమిటి?



ప్రపంచీకరణ నేపథ్యంలో మన సంస్థను పురోగమన మార్గంలో నడపడం కోసం మనమేంచేయాలి? దీనిలో కార్మిక సంఘాల పాత్ర ఏమిటి? యాజమాన్య బాధ్యత ఏమిటి? అసలు దేశ వ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా బొగ్గు పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లు ఏమిటి? అనే అంశంపై కొత్తగూడెంలో రెండు రోజులపాటు శిక్షణా తరగతులను నిర్వహించారు. దీనిలో ముఖ్యాతిథిగా పాల్గొన్న మన ఛైర్మన్ అండ్ ఎం.డి. శ్రీ ఎస్. నర్సింగ్‌రావు మాట్లాడుతూ ప్రపంచీకరణ మూలంగా ఎదురౌవుతున్న సవాళ్ళను సమిష్టిగా ఎదుర్కొవడానికి కార్మిక సంఘాలు చేయూత నివ్వాలని



పిలుపునిచ్చారు. గుర్తింపు కార్మిక సంఘం (ఎ.ఐ.టి.యు.సి.) జనరల్ సెక్రటరి శ్రీ వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ సంస్థ మనుగడ కోసం నిర్మాణాత్మకంగా తమ సంఘం పూర్తి సహకారాన్ని అందిస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఇంకా మన డైరెక్టర్లు అన్ని ఏరియాల గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాపులో తమకు తెలియని అనేక విషయాలు తెలుసుకునే అవకాశం కలిగిందని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఐ.ఎం.ఇ. సంస్థ అధ్యాపకులు తరగతులు నిర్వహించారు.

# భూగర్భ గనులను లాభాదాయకంగా నడపడం ఎలా?



మన కంపెనీలో గల 42 భూగర్భగనులు కూడా నష్టాల్లోనే నడుస్తున్నాయి. వీటిని లాభాల్లోకి తీసుకురావడం కోసం సింగరేణి వ్యాప్తంగా మేధోమధనం జరుగుతోంది. రామగుండంలో ఈ అంశంపై జరిగిన సదస్సులో ప్రసంగిస్తున్న మన ఛైర్మన్ అండ్ యం.డి. శ్రీ యస్. నర్సింగ్‌రావు. దీనిలో మన డైరెక్టర్లతోపాటు ఏరియా ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.



# సామాజిక బాధ్యతగా సమీప గ్రామాలకు చేయూత



సింగరేణి సంస్థ తన సమీప గ్రామాల ప్రజల కోసం సామాజిక బాధ్యతగా ఎంతో కొంత సహాయమందిస్తోంది. ఈ క్రమంలో భూపాలపల్లి పరిసర గ్రామాల ప్రజలకు సింగరేణి ఏరియా ఆస్పత్రిలో ఉచిత వైద్య సౌకర్యాన్ని ఇటీవల మన ఛైర్మన్ అండ్ యం.డి. శ్రీ ఎస్. నర్సింగ్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ శ్రీమతి దమయంతి పాల్గొన్నారు. ఇదే విధంగా బెల్లంపల్లి ఏరియాలోని ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాల ప్రజలకూడా ఉచిత వైద్యం అందించనున్నట్లు యాజమాన్యం ప్రకటించింది.

# రక్షణ విజయోత్సాహం

42వ రక్షణ వారోత్సవాల్లో ప్రథమ బహుమతి పొందిన 21 ఇంక్లైన్ (ఇల్లందు) గని కార్మికులు, సూపర్ వైజర్లు అధికారుల విజయోత్సహం ఇది! ఈ గని ఈ ఏడాదే కాక గతంలో కొన్నేళ్ళుగా కూడా ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధిస్తూ ఆదర్శప్రాయంగా ఉంటోంది.



# సింగరేణీయుల సమాచారం

ప్రత్యేక సంచిక - 2007

సంచిక : 5 సంపుటి : 43


## లో.ప.లి.పే.జీ.ల్లో


**భూగర్భ గనులు - భవితకు బాటలు** 2

మన సంస్థ 2008 సంవత్సరానికి భూగర్భ గనులు - భవితకు బాటలు అనే నినాదాన్ని ఇచ్చింది. దీనిపై మన ఛైర్మన్ అండ్ ఎం.డి. శ్రీ ఎస్. నర్సింగ్‌రావుగారి లేఖ.

**అందరినీ ఐక్యం చేసి కదిలించిన సింగరేణీయత** 3

సింగరేణి వ్యాప్తంగా అత్యంత ఉత్సాహపూరితంగా, ఉల్లాసంగా సాగిన సింగరేణి రన్‌పై ప్రత్యేక కథనం.

**ఉత్పత్తి వ్యయం తగ్గించుకుంటేనే లాభాలు** 4

ఉత్పత్తి పెరుగుతున్నా లాభాలు అంతగా పెరగటం లేదు. దీనికి కారణాలేమిటి? మన డైరెక్టర్ ఫైనాన్స్ శ్రీ ఇ.వి. కృష్ణారెడ్డితో ప్రత్యేక ఇంటర్వ్యూ.

**సింగరేణిలో సమ్మెలు లేని సంవత్సరం 2007** 6

సింగరేణి చరిత్రలో తొలిసారిగా 2007లో ఒక సమ్మె కూడా జరగకుండా కొత్త అధ్యాయం సృష్టించారు మన కార్మికులు. దీనిపై పూర్వాపరలు వివరిస్తూ స్పెషల్ స్టోరీ.

**కాంట్రాక్టు కార్మికులకు కూడా సి.యం.పి.ఎఫ్.** 10

సింగరేణి కార్మికులకే కాక కాంట్రాక్టు కార్మికులకు కూడా సి.యం.పి.ఎఫ్. అమలు చేయడానికి కంపెనీ అంగీకరించింది. పూర్తి వివరాలతో...

**రక్షణ మన జీవన విధానం కావాలి** 11

42వ రక్షణ వారోత్సవాల బహుమతి ప్రధానోత్సవ వేడుకలపై ప్రత్యేక వార్త

**జై సింగరేణి జైజై సింగరేణి (సెంటర్ స్ప్రెడ్)** 12

సింగరేణి వ్యాప్తంగా జరిగిన సింగరేణి దినోత్సవాలు - 2007పై చిత్రమాలిక

**సైనికులుగా పోలీసులుగా 485 మంది యువకులు** 14

సింగరేణి సేవ సమితి ఇచ్చిన ఆర్మీ ర్యాలీ శిక్షణ ఫలితంగా నేడు సింగరేణి వ్యాప్తంగా 485 యువకులు ఆర్మీ తదితర రక్షణ శాఖలో ఉద్యోగాలు పొందారు. దీనిపై స్పెషల్ స్టోరీ.

**మన విజిలెన్స్ శాఖ విధులేమిటి?** 16

మన సంస్థలోగల విజిలెన్స్ శాఖ ఏం చేస్తుంది? అవినీతిని అక్రమాలను ఎలా అరికడుతుంది? అనే అంశాలపై సి.జి.యం. విజిలెన్స్‌తో ఇంటర్వ్యూ...

**సేవా పథంలో...** 18

సింగరేణి సేవసమితి ద్వారా వివిధ ఏరియాలో చేపడుతున్న కార్యక్రమాలపై వార్త సమాహారం

**ఇంకా...**

**సింగరేణి క్రీడరంగం (21), భూభ్రమణం (22), లేఖలు, కవితలు (23), జ్ఞాపకాలపురలు (24)**


## ఒక్కమాట...

### ఇదే స్ఫూర్తిని కొనసాగిద్దాం !

2007 సంవత్సరం సింగరేణి చరిత్రలో తొలిసారిగా సమ్మెలు లేని సంవత్సరంగా నమోదు కావడం ఒక గొప్ప విజయంగా పేర్కొనవచ్చు. సింగరేణి అంటేనే సమ్మెలు - సమ్మెలు అంటే సింగరేణి అనే అపవాదులను శాశ్వతంగా రూపుమాపుతూ మన సింగరేణీయులు సరికొత్త చరిత్రను నెలకొల్పారు. ఏడాదిలో సమ్మెలేని రోజు సింగరేణిలో ఉండనే ఉండదు అనే నానుడి తిరగరాస్తూ "సమ్మె జరిగిన రోజు సింగరేణిలో ఉండనే ఉండదు" అనే కొత్త పరిస్థితిని సృష్టించారు. ఇదొక శుభ పరిణామం. సమ్మెలు, ఆందోళనలు గత కాలపు చరిత్ర. ఐక్యత, సమిష్టి కృషి, విజయ సాధన నేటి కర్తవ్యాలు. అత్యుత్తమ లక్ష్యాలను ఐక్యతతో సాధిద్దాం - అనే నినాదంతో మనమంతా ఇక ముందు కూడా చక్కని పారిశ్రామిక శాంతితో, భద్రతతో ముందుకు సాగుదాం. ఆదర్శవంతమైన కంపెనీలకే ఆదర్శంగా నిలుద్దాం.

★ ★ ★

**"సాధించిన దానికి సంతృప్తిని చెంది ఇదే విజయమనుకుంటే పొరపాటేనోయ్!"**

అంటూ ఒక కవి నాలుగు దశాబ్దాల క్రితమే కర్తవ్య బోధన చేశాడు. లక్ష్యాలు సాధించగానే కలిగే సంతృప్తి నిర్లక్ష్యానికి, నిర్లిప్తతకు దారితీయకూడదు. వేగంగా సాగుతున్న ఈ కాలంలో మన లక్ష్యాలు, గమ్యాలు నిరంతరం ఉత్తమ, ఉన్నత స్థాయికి పెరుగుతూనే వుంటాయి. వీటిని సవాళ్ళుగా స్వీకరిస్తూ ముందుకు పోవాలి. కనుక అన్నివిషయాల్లోను పోటీ తత్వంతో పనిచేయగలగాలి. లేదంటే నేటి ఈ ప్రపంచీకరణ నేపథ్యంలో మనుగడ కష్టం.

**డా॥ టి.ఆర్.కె.రావు,** ఐ.ఆర్.టి.ఎస్.
ఎడిటర్-ఇన్-చీఫ్


ఎడిటర్-ఇన్-చీఫ్ — **డా॥ టి.ఆర్.కె. రావు,** IRTS, Executive Director (MM,F&PR)

ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ — **ఎస్. చంద్రశేఖర్,** Chief Public Relations Officer

ఎడిటర్ — **గణాశంకర్ పూజారి,** Communication Co-ordinating Officer

అసోసియేట్ ఎడిటర్స్ — డి.వి. సుబ్బారావు, Public Relations Assistant; శ్రీమతి జె. సావిత్రి, Spl. Gr. Clerk

Ph: 040-23316171, 23300132

ఈ పత్రికను మన వెబ్‌సైట్‌లో కూడా చూడవచ్చు : **www.scclmines.com**

ఈ పత్రికపై మీ అభిప్రాయాలను మాకు మెయిల్ చేయండి : **E-mail: sccl.samacharam@scclmines.com**

## చైర్మన్ లేఖ



### ప్రియమైన సింగరేణీయులకు...

2008 సంవత్సరానికి మనం **భూగర్భగనులు - భవితకు బాటలు** అనే నినాదం ఇవ్వడం జరిగింది. ఎందుకంటే సింగరేణి భవిష్యత్తు అనేది భూగర్భ గనులతోనే ముడిపడి ఉంది. రాబోయే పదేళ్ళ కాలంలో ఇప్పుడు అధికోత్పత్తి సాధిస్తున్న ఓపెన్‌కాస్ట్ గనుల బొగ్గు నిల్వలు తగ్గుముఖం పడతాయి. కనుక నానాటికీ పెరుగుతున్న బొగ్గు డిమాండ్‌ను అందుకోవాలంటే మన భూగర్భగనులనే ప్రధాన వనరులుగా గుర్తించాలి.

భూగర్భగనుల నుంచి అధికోత్పత్తితోపాటు ఎక్కువ ఉత్పాదకత సాధించే యాంత్రీకరణతో నష్టాలు తగ్గించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గత ఏడాది భూగర్భ గనుల్లో టన్ను బొగ్గు ఉత్పత్తి వ్యయం రూ॥ 1800 ఉంటే, అమ్మకం ధర రూ॥ 1065/- మాత్రమే. అయితే మనం గత ఏడాది కాలంగా తీసుకుంటున్న అనేక చర్యలతోపాటు, ఎస్.డి.ఎల్స్, ఎల్.హెచ్.డి.లుతో సాధించిన అధికోత్పత్తి ఫలితంగా ఆరు భూగర్భగనులు (ఆర్.కె.6, ఆర్.కె.7, ఆర్.కె.ఎన్.టి., ఎస్.ఆర్.పి. 3 మరియు 3ఎ, జిడికె-7 ఎల్.ఇ.పి., జిడికె-8 గనులు) డిసెంబర్ నెలలో లాభాన్ని సాధించాయి. జిడికె-10ఎ గని ఈ ఆర్థిక సంవత్సరంలో లాభాన్ని సాధించింది. ఈ విధంగా కంపెనీ మొత్తం మీద భూగర్భగనుల ఉత్పత్తి వ్యయం టన్నుకు రూ. 1680/-కి తగ్గింది. ఇంకా తగ్గించుకోవడానికి మరెన్నో అవకాశాలున్నాయి. ఈ అవకాశాలను మనం సద్వినియోగపరచుకోవాలి.

ఎన్నో అసాధ్యాలను సుసాధ్యం చేసిన మనం భూగర్భగనులను కూడా లాభాల్లోకి తీసుకురావడమన్నది తక్షణ సవాలుగా స్వీకరించాలి. అందుకు అందరూ సహకరించాలని కోరుతున్నాను.

ఇట్లు

**శ్రీ ఎస్. నర్సింగ్‌రావు,** I.A.S.
చైర్మన్ అండ్ ఎం.డి.
సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్




## భూగర్భగనులు - భవితకు బాటలు





# అందరినీ ఐక్యం చేసి, కదిలించిన సింగరేణీయత

**ఉత్సాహం, ఉద్వేగం, ఉత్తేజం... అడగడుగునా పదపదాన ప్రస్ఫుటించగా, వేలాది సింగరేణీయులు, వారి కుటుంబీకులు, పెద్దా చిన్నా భేదం లేక ఒకే కుటుంబం అనే స్ఫూర్తితో సింగరేణి రన్‌లో పాల్గొన్నారు. మనం ఎన్నెన్నో పండుగలు జరుపుకొంటుంటాం. కొన్ని పండుగలు ఆయా మతస్థులకు మాత్రమే ముఖ్యమైనవి కానీ సింగరేణి పండుగ, మనందరిదీ, ప్రతి ఒక్కరిదీ అనే భావన కలగటంతో అధికారులు, కార్మికులన్న తేడా లేకుండా అంతా ఆడిపాడి తమ ఆనందాన్ని వ్యక్తం చేసుకొన్నారు. ఉత్పత్తి లక్ష్యాలు సాధిస్తూ, ఉత్పాదకత పెంచుకొంటూ ముమ్మందుకు పోతున్న ఉత్సాహం, సంతోషం ఈ సింగరేణి పండుగలో ప్రతీచోటా కన్పించింది.**

**సింగరేణి రన్ :-** ఎప్పటిలానే ఈసారి కూడా 'సింగరేణి రన్' సింగరేణి కుటుంబాలన్నింటినీ కదిలించింది. 19వ తేదీన మణుగూరులో ఈ పరుగును మన డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్సు శ్రీ డి.ఎల్.ఆర్. ప్రసాద్ ప్రారంభించారు. ఏరియా సి.జి.ఎం. శ్రీ బి. రమేష్ కుమార్ సారధ్యంలో సాగిన ఈ పరుగులో వేలాది మంది పాల్గొన్నారు. జానపద నృత్యాలు, మతపెద్దల దీవెనలు, వర్తక వ్యాపార వర్గాల కలయికతో సాగిన ఈ పరుగు మణుగూరు పట్టణానికే కొత్త శోభ చేకూర్చింది. ఆ తర్వాత సింగరేణి జ్యోతి 20వ తేదీన **కొత్తగూడెం ఏరియా**కు చేరింది. ఏరియా సి.జి.ఎం. శ్రీ సి.హెచ్. కృష్ణయ్య సారథ్యంలో సాగిన ఈ పరుగు కాలరీ ఏరియాల గుండా సాగగా మహిళలు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని సింగరేణి పట్ల తమ అభిమానం చాటుకున్నారు. అదేరోజు సింగరేణి జ్యోతి **కార్పొరేట్ కార్యాలయానికి** చేరగా సి.జి.ఎం. పర్సనల్ ఎం. గంగిరెడ్డి సారథ్యంలో ఉల్లాసపూరిత వాతావరణంలో పరుగు నిర్వహించారు. దీనిలో మన ఉన్నతాధికారులైన శ్రీ ఇ.వి. కృష్ణారెడ్డి (డైరెక్టర్ ఫైనాన్స్) శ్రీ ఎల్. శశిధర్ (డైరెక్టర్ పా), శ్రీ ఇ. రాజారావు (డైరెక్టర్–ఇ అండ్ ఎం)తో పాటు కార్పొరేటు కార్యాలయంలో గల వివిధ శాఖల అధిపతులు, ఉద్యోగులు కార్మికులు వెంట రాగా ఈ పరుగు కార్పొరేట్ పరిధిలో గల కాలనీల గుండా సాగి బస్‌స్టాండ్ వద్ద ముగిసింది.

అదేరోజు సాయంత్రం 3 గంటలకు సింగరేణి పుట్టినిల్లయిన **ఇల్లందుకు** సింగరేణి జ్యోతి చేరుకోగా జి.ఎం. శ్రీ ఆర్.ఎస్. మంత్రి సారథ్యంలో పట్టణ ప్రాంతంలో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో పరుగు సాగింది. పరుగు ప్రారంభంలో సింగరేణి బొగ్గు నిక్షేపాలు కనుగొన్న సర్ విలియమ్ కింగ్ విగ్రహానికి పూల మాలలు వేశారు. ఇల్లందు పట్టణంలో సాగిన పరుగు ప్రజల్ని ఆకట్టుకొంది.

21వ తేదీన **భూపాలపల్లి** చేరుకొన్న సింగరేణి జ్యోతికి కార్మిక కుటుంబాల నుంచి అఖండ స్వాగతం లభించింది. జి.ఎం. శ్రీ డి. రాములు నాయకత్వంలో స్థానిక అంబేద్కర్ స్టేడియం నుంచి ప్రారంభమైన పరుగులో తెలంగాణా ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన జానపద కళా రూపాలు, విచిత్ర వేషధారణలు, బోణాలతో వేలాది మంది మహిళలు, కార్మికులు పాల్గొనగా కాలనీలు మొత్తం జై సింగరేణి నినాదాలతో మార్మోగిపోయాయి.

అదేరోజు సింగరేణి జ్యోతి **రామగుండం-3** ఏరియాకు చేరింది. జి.ఎం. శ్రీ సిహెచ్. వెంకటేశ్వరరావు సారథ్యంలో జరిగిన సింగరేణి పరుగులో వేలాది మంది మహిళలు, సింగరేణీయులు వారి పిల్లలూ ఉత్సాహంగా పాల్గొన్నారు. సెంటినరీ కాలనీలో అడుగడుగునా జ్యోతికి సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికి సింగరేణిపై తమకు గల భక్తినీ, అభిమానాన్ని మహిళలు చాటుకున్నారు. విచిత్ర వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆ తర్వాత **రామగుండం-2** ఏరియాకు చేరిన సింగరేణి జ్యోతికి జి.ఎం. శ్రీ రాజేందర్ రెడ్డి సారథ్యంలో ఘన స్వాగతం పలికారు. స్థానిక 8 ఇంక్లైన్ కాలనీలో కన్నుల పండువగా సాగిన పరుగులో వేలాది మంది కార్మికులు వారి కుటుంబీకులు ముఖ్యంగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సింగరేణి జ్యోతికి అడుగడుగునా నీరాజనాలర్పించారు. జై సింగరేణి నినాదాలు మార్మోగుతుండగా సింగరేణి పరుగు ప్రతీ ఒక్కరి హృదయాన్ని స్పందింపచేసింది.

**బెల్లంపల్లి ఏరియాలో** జి.ఎం. శ్రీ సి.వి. రెడ్డి సారథ్యంలో జరిగిన సింగరేణి రన్ బెల్లంపల్లి, మాదారం – గోలేటి మార్గంలో దాదాపు 30 కిలో మీటర్ల పొడవునా ఉత్సాహ పూరితంగా సాగింది. తెలంగాణా ప్రాంత సంబరాలను తలపింపజేస్తూ బోణాలు, విచిత్ర వేషధారణలు, పాటలు నృత్యాలతో అంతా కోలాహలంగా సాగింది. దాదాపు ప్రతీ కార్మిక కుటుంబం దీనిలో పాల్గొన్న దంటే అతిశయోక్తి కాదు.

22వ తేదిన **రామగుండం1** ఏరియాలో సింగరేణి పరుగును మన డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్సు శ్రీ డి.ఎల్.ఆర్. ప్రసాద్ ప్రారంభించారు. సి.జి.ఎం. శ్రీ ఎ. మనోహర్ రావు ఆధ్వర్యంలో సాగిన ఈ పరుగు ఏరియాలోని గనులన్నింటినీ తాకుతూ కార్మిక వాడలు కాలనీల గుండా, గోదావరి ఖని పట్టణం మొత్తం చుట్టివచ్చి పవర్‌హౌజ్ కాలనీ వద్ద ముగిసింది. వేలాదిగా కార్మికులు, పిల్లలు, స్త్రీలు అత్యంత ఉత్సాహంగా, ఉల్లాసంగా, సింగరేణిపై భక్తిభావాన్ని అడుగడుగునా వ్యక్త పరుస్తూ ముందుకు సాగారు. సింగరేణి జ్యోతినే సింగరేణి మాతగా ఎంచి, దీనిని చూడటానికి, మొక్కడానికీ అందరూ ఉత్సాహం చూపారు. రామగుండం 1 చరిత్రలో ఇది ఒక పెద్ద పరుగుగా నిలిచిపోతుంది.

23వ తేదిన **మందమర్రి ఏరియాలో** జి.ఎం. శ్రీ ఆంథోని రాజ సారథ్యంలో సాగిన సింగరేణి పరుగులో మందమర్రి ఏరియాలో గల గనులు, కార్మికవాడలను తాకుతూ వందలాది మంది కార్మికులు వారి కుటుంబీకులు పాల్గొనగా డబ్బులు, కోలటాలు, నృత్యాలతో గొప్ప జాతరగా ఉల్లాస భరితంగా సాగింది.

**శ్రీరాంపూర్‌లో...**

వందలాది కిలోమీటర్లు ప్రయాణించి, వేలాదిమంది కార్మికులు, వారి కుటుంబీకుల ఆశలు, ఆకాంక్షలను తనతో తీసుకువచ్చిన సింగరేణి జ్యోతి డిసెంబర్ 23 వ తేదీన సెంట్రల్ ఫంక్షన్ జరిగే శ్రీరాంపూర్ ఏరియాకు చేరింది. జి.ఎం. శ్రీ సుగుణాకర్ రెడ్డి సారథ్యంలో "నభూతో నభవిష్యతి" అన్న రీతిలో సింగరేణి పరుగును అత్యద్భుతంగా నిర్వహించి సింగరేణీయుల హృదయస్పందనకు దర్పణంగా నిలిపారు. వివిధ ప్రాంతాలలో వివిధ గనులు డిపార్టుమెంట్ల సారథ్యంలో సింగరేణి రన్‌కు స్వాగతం పలికారు. సింగరేణి ప్రగతిని తెలిపే శకటాలు, పౌరాణిక, జానపద వేషధారణలు, నృత్యాలు, డప్పు బృందాలు ఇలా అత్యంత కోలాహలంగా సాగిన రన్ శ్రీరాంపూర్‌లో వేలాది కార్మికులను, కార్మిక కుటుంబీలను కదిలించింది.

చివరిగా సెంట్రల్ ఫంక్షన్ జరుగుతున్న ప్రగతి మైదాన్‌కు సింగరేణి జ్యోతి రాగానే అక్కడ వేచి ఉన్న వేలాది మంది కార్మికులు జై సింగరేణి, జైజై సింగరేణి అనే నినాదాలతో స్వాగతించారు. సింగరేణి జ్యోతిని జి.ఎం. సుగుణాకర్ రెడ్డి నుంచి శ్రీ డాక్టర్ టి.ఆర్.కె. రావు (ఇడిఎం.ఎం.పి.ఆర్) తర్వాత శ్రీ ఇ.వి. కృష్ణారెడ్డి (డైరెక్టర్) ఫైనాన్స్ అందుకొని మహాక్రీడా జ్యోతికి సమీపంలో శ్రీ డి.ఎల్.ఆర్. ప్రసాద్ డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్సు)కు అందజేయగా ఆయన దీనిని చివరిగా మన ఛైర్మన్ అండ్ ఎండి శ్రీ ఎస్. నర్సింగ్‌రావుకు అందించారు.

వేదికకు కుడివైపు ఎత్తు మీద ఏర్పాటు చేసిన సింగరేణి చైతన్య మహా జ్యోతిని మన ఛైర్మన్ శ్రీ ఎస్. నర్సింగ్‌రావు, గుర్తింపు కార్మిక సంఘం ఎ.ఐ.టి.యు.సి. ప్రధాన కార్యదర్శి శ్రీ వి. సీతారామయ్యతో కల్సి ప్రజ్వలింప చేశారు. దీంతో ప్రాంగణం అంతా జై సింగరేణి నినాదాలతో మార్మోగి పోయింది. పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చి సింగరేణి రన్ ముగింపు ఘడియల్ని మరింత ఉత్సాహ పూరితంగా మలిచారు. మనందరి ఆశలు ఆకాంక్షలకు ప్రతీకగా ఆ మహాజ్యోతి ఆకాశమంతటా వెలుగులు విరజిమ్ముతూ ప్రజ్వరిల్లింది.

**ఉత్సాహపూరితంగా సాగిన ఈ సింగరేణి రన్ కార్యక్రమానికి శ్రీ శేషు కుమార్ రెడ్డి సి.జి.యం. (సి.పి.పి.) సారథ్యం వహించగా శ్రీ ఎన్.ఎస్.ఆర్.మూర్తి, రమేష్, గోపీచంద్‌లు సింగరేణి జ్యోతిని అన్ని ఏరియాలకు తోడ్కొని వెళ్ళారు.**

## మన విధానం

# అధికోత్పత్తి సాధించడమేకాదు - ఉత్పత్తి వ్యయం తగ్గించుకొంటేనే లాభాలు

### డైరెక్టర్ (ఫైనాన్స్) శ్రీ ఇ.వి. కృష్ణారెడ్డి సందేశం

**"ఉత్పత్తి లక్ష్యాలు పెంచుతున్నాం- వాటిని సాధిస్తున్నాం. ఇది చాలా హర్షణీయం. అయితే ఉత్పత్తి వ్యయం - అమ్మకం ధరల మధ్య అంత తేడా ఉండనందున ఎంత ఉత్పత్తి పెరిగినా లాభాలు ఆశించినంతగా రావడం లేదు. అధికోత్పత్తితో పాటు అధిక లాభాలు సాధించాలంటే ఉత్పత్తి వ్యయం తగ్గించుకోవడమే ఏకైక మార్గం" అని అంటున్నారు మన డైరెక్టర్ ఫైనాన్స్ శ్రీ ఇ.వి. కృష్ణారెడ్డి. ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూలో కొన్ని ముఖ్యాంశాలు.**



**ప్ర: మనం ఉత్పత్తి లక్ష్యాలు పెంచుకొంటూ వాటిని సాధిస్తున్నాం కదా! మరి లాభాలు అంతగా లేవంటున్నారు కారణం?**

జ : మన అమ్మకం ధర – ఉత్పత్తి వ్యయం మధ్య అంత తేడాలేక పోవడమే దీనికి కారణం. అమ్మకం ధర – ఉత్పత్తి వ్యయం గత 8 నెలల కాలంలో సగటున రూ. 1070 – రూ. 1060 ల మధ్య ఊగిసలాడుతోంది. ఒకసారి అమ్మకం ధర 1070 ఉంటే ఉత్పత్తి వ్యయం 1040 వుంటోంది. మరోసారి దీనికి భిన్నంగా అమ్మకం ధర రూ. 1040 వుంటే ఉత్పత్తి వ్యయం రూ. 1070 వుంటోంది. కాబట్టి సింగరేణిలో ఉత్పత్తి గణనీయంగా పెరిగినా గణాంకాల్లో చూస్తే లాభాలు చాలా నామమాత్రంగానే వున్నాయి.

**ప్ర: కాని, ఓసి గనుల్లో లాభాలు బాగానే వుంటున్నాయి కదా!**

జ : ఓసి గనులన్నీ లాభాల్లో నడుస్తున్న మాట నిజమే కానీ భూగర్భ గనులన్నీ దాదాపు నష్టాల్లో వున్నాయి. 2006–07 లో భూగర్భగనుల్లో రూ. 869 కోట్లు నష్టం వచ్చింది. ఓసి గనుల్లో వచ్చిన లాభం దీన్ని పూడ్చడానికే సరిపోతోంది.

**ప్ర: మరి వచ్చిన లాభాలు ఏమిటి? బొగ్గు అమ్మకం ద్వారా లభించినవి కావా?**

జ : కొన్ని వాస్తవాలు ఆశ్చర్యకరంగా వుండవచ్చు, కాని గణాంక వివరాలు వాస్తవాలను వెల్లడిస్తుంటాయి. నేను ఇంతకు ముందు చెప్పినట్లు ఉత్పత్తి వ్యయం, అమ్మకం ధర దాదాపు సమానంగా వుండటం వలన లాభాలు నామ మాత్రంగానే వుంటున్నాయన్నది వాస్తవం. అయితే మన కంపెనీ బ్యాంకుల్లో దాచుకొన్న సొమ్ము, బాండ్ల రూపంలో వున్న మొత్తాలు దాదాపు రూ. 1100 కోట్ల వరకు వున్నాయి. వీటిపైన ఏడాదికి రూ. 90 కోట్లు వడ్డీ వస్తుంది. ఈ ఏడాది మనం టాక్స్‌లు చెల్లింపుకు పూర్వం ప్రకటించిన లాభాలు రూ. 117 కోట్లలో, రూ. 113 కోట్లు వడ్డీ కింద లభించిన సొమ్మేనని గుర్తించాలి.

**ప్ర: మరి లాభాల కోసం ఏంచేస్తే బాగుంటుందని మీరు సూచిస్తున్నారు?**

జ : భూగర్భ గనుల్లో కంపెనీకి అదనంగా 15,000 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయగలిగినట్లయితే కోటి రూపాయల చొప్పున నష్టాన్ని తగ్గించుకోగలుగుతాం. ఇది ఎలా చేయగలమన్నది గని అధికారులు, కార్మికులు నిర్ణయించుకోవాలి. అలాగే ఓసి గనుల్లో కూడా కంపెనీ వారు తీస్తున్న ఓవర్‌బర్డెన్ను ప్రస్తుతం తీస్తున్న దానికన్నా మన సామర్థ్యం ఇంకా పెంచుకోగలిగితే అక్కడ రూ. 100 కోట్లు పొదుపు చేసిన వారమవుతాం. యంత్ర సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవడానికి కృషి సల్పితే ఇది సాధ్యం కాగలదు. ఈ రెండు చర్యల వలన కంపెనీకి నికర లాభాలు పెరిగే అవకాశం వుంది.

**ప్ర: టాక్సుకు ముందు, టాక్స్‌కు తర్వాత లాభాలు అంటూ మీరు మన లాభాలు ప్రకటిస్తారు. అసలు కంపెనీ ఏఏ టాక్సులు చెల్లిస్తుంది. ఎవరికి చెల్లిస్తుందో వివరిస్తారా?**

జ : మన కంపెనీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో నడుస్తున్న కంపెనీ, చట్టాల ప్రకారం వివిధ రకాల టాక్సులను, రాయల్టీలనీ మనం చెల్లిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వానికి మనం ఏటా సేల్స్ టాక్స్ చెల్లిస్తాం. మనం మన కంపెనీ కోసం కొనే యంత్రాలు, విడిభాగాలు, వస్తువులపైన ఇది వుంటుంది. ఇది ఏడాదికి సుమారు రూ. 30–40 కోట్లు వరకు వుంటుంది. అలాగే రాయల్టీ కూడా చెల్లిస్తాం. భూగర్భ గనుల నుంచి తీసే ఖనిజాల అమ్మకాలపై ఎంఎం ఆర్ అండ్ డి యాక్ట్ ప్రకారం మనం 2002 ఆగస్టు 16 నుంచి టన్నుకి రూ. 90 చొ॥న రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీ చెల్లిస్తున్నాం. అలాగే ఎ.పి. మినరల్ బేరింగ్ లాండ్స్ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) సెస్‌ను టన్నుకు రూ. 20 చొ॥న 2005 నుంచీ చెల్లిస్తున్నాం.

**గత 3 సంవత్సరాలుగా మనం రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించిన రాయల్టీ, సెస్‌ల వివరాలు దిగువ చూడండి.** (జులై 2007 వరకు)

రూ. కోట్లలో

| సంవత్సరం | రాయల్టీ | సెస్ | మొత్తం |
|---|---|---|---|
| 2005-06 | 324.00 | 42.86 | 366.86 |
| 2006-07 | 313.50 | 75.27 | 388.77 |
| 2007-08 | 115.80 | 27.48 | 143.28 |

ఇవి కాక కేంద్ర ప్రభుత్వానికి ఇన్‌కంటాక్స్ (దీన్నే కార్పొరేట్ టాక్స్ అంటారు) కడుతున్నాం. ఇది మన ఆదాయం పై 33.39% వుంటుంది. గత ఏడాది రూ. 68 కోట్లు కట్టాం. అంతేకాక సెంట్రల్ సేల్స్‌టాక్స్ అనేది కూడా ఒకటి వుంది. అది కూడా చెల్లిస్తాం. దీనిలో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం వారు కొంత వాటా ఇస్తుంటారు. ఈ విధంగా చూస్తే ఏటా మనం రాయల్టీ, టాక్సుల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుమారు రూ. 500 నుండి 600 కోట్లు వరకూ కడుతున్నాం. ఈ ధనం మన దేశ అభివృద్ధికోసం, వివిధ పథకాల కోసం వినియోగించబడుతుంది. ఈ విధంగా మన శ్రమ, దేశాభివృద్ధికి కూడా ఎంతో కొంత దోహద పడుతోందని మనమంతా గమనించాలి, అందుకు గర్వించాలి కూడా.

**ప్ర: అలాగే డివిడెండ్ అనేది కూడా మనం చెల్లిస్తుంటాం కదా! ఇది ఎంత? ఎలా చెల్లిస్తుంటాం?**

జ : మనకందరికీ తెల్సు మన కంపెనీలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 49:51 నిష్పత్తిలో భాగస్వామ్యం కలిగివున్నాయి. వీరిద్దరి ద్వారా సమకూరివున్న మూలధనం రూ. 1733 కోట్లు. మామూలు పరిభాషలో చెప్పాలంటే వీరు **పెట్టిన పెట్టుబడికి ఏటా కంపెనీ చెల్లించే లాభాల్లోని వాటా పేరే డివిడెండ్.** ఈ డివిడెండ్‌ను లాభాలు వచ్చినప్పుడే చెల్లిస్తారు. ఎంత చెల్లించాలన్నది కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు నిర్ణయిస్తారు. మరియు వాటా దారుల ఆమోదంతో చెల్లిస్తారు. 2005–06లో 5% డివిడెంట్ రమారమి రూ. 100 కోట్లు డివిడెండ్ టాక్స్‌తో చెల్లించాం. ఈ సం॥ 2006–05లో లాభాలు తగ్గినందువల్ల కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు లాభాల్లో 1.2% అంటే రూ. 20 కోట్లు ఇవ్వాలని సిఫార్స్ చేయడం జరిగింది.

**ప్ర: చాలా పబ్లిక్ రంగ సంస్థలు పబ్లిక్ ఇష్యూకి వెళ్లి షేర్స్ అమ్ముతున్నాయి కదా! మన కంపెనీ కూడా అలా ఎందుకు చేయకూడదని కొందరు అంటున్నారు.**

జ : ప్రభుత్వ రంగ సంస్థల్లో కొన్ని ఆయిల్ కంపెనీలు, గ్యాస్ కంపెనీలు పబ్లిక్ ఇష్యూకి వెళ్తున్నాయి నిజమే. కాని కోల్ ఇండియాకు ఇంకా ఈ విషయంలో అనుమతి లభించలేదు. ఈ పద్ధతిలో ఏం జరుగుతుందంటే మూలధనంలో కొంత మేరకు పెట్టుబడులను ప్రైవేటు వ్యక్తులకు అమ్మి, షేర్ మార్కెట్టులోకి ప్రవేశించడం, స్టాక్ ఎక్స్చేంజిలో పేరు నమోదు చేసుకోవడం అనేది జరుగుతుంది. రాబోయే రోజులలో మనకు వేల కోట్ల రూపాయల పెట్టుబడులు కావాల్సి వచ్చినప్పుడు, స్టాక్ ఎక్స్చేంజిలో మనకుగల పరపతి, ప్రచారం ఆధారంగా ప్రజల విశ్వాసాన్ని చూరగొని, పెట్టుబడులను సమీకరించుకొనేందుకు ఈ విధంగా వీలవుతుంది. పబ్లిక్ ఇష్యూకోసం కోల్ ఇండియా ప్రయత్నాలు ప్రారంభించింది. కోల్ ఇండియాకు అనుమతి లభిస్తే, మనమూ అదే బాటలో వెళ్లే అవకాశం లేకపోలేదు.

**ప్ర: గతంలో కేంద్రం 663 కోట్ల వడ్డీపై ప్రకటించిన మారిటోరియం కాల పరిమితి తీరిందికదా! మరి ప్రస్తుతం ఏం చేయబోతున్నాం?**

జ : మన కంపెనీ కేంద్రానికి రూ. 663 కోట్ల వడ్డీని 1997కు పూర్వం చెల్లించాల్సి వుంది. కాని అప్పట్లో మనం బిఐఎఫ్ఆర్‌లోకి పోయివున్నాం. కాబట్టి, ఆ వడ్డీని అప్పట్లో చెల్లించలేమనీ, కనుక దానిపై మారిటోరియం ప్రకటించమనీ కోరాం. దీనికి కేంద్ర అంగీకరించి 10 ఏళ్లపాటు మారిటోరియం ప్రకటించింది. 10 ఏళ్ల తర్వాత 10 వాయిదాల్లో 663 కోట్ల చెల్లించాలని అనుమతించింది. ఇది జరిగి ఈ ఏడాదికి 10 ఏళ్లు పూర్తవుతుంది. కనుక మనం ఈ ఏడాది నుంచి 663 కోట్ల వడ్డీని 10 వాయిదాల్లో (10 ఏళ్లలో) కేంద్రానికి చెల్లించాల్సి వుంది. 2007-08లో 66.3 కోట్లు దీనికోసం కేటాయించాల్సి వుంది కూడా. కాని మనం దీన్ని చెల్లించే స్థితిలో లేము కనుక మరో సారి 10 ఏళ్లపాటు మారిటోరియం ప్రకటించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నాం.

**ప్ర: మనం పవర్‌హౌస్ నిర్మాణం వైపు అడుగు వేస్తున్నాం. ఇది లాభదాయకమైనదేనా?**

జ : 11వ పంచవర్ష ప్రణాళికా కాలంలో ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న విద్యుత్తుకు అదనంగా మరో 78,000 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. కనుక విద్యుత్తుకు మంచి డిమాండ్ ఉండబోతోందని గ్రహించి, 500 మెగా వాట్ల విద్యుత్తు కేంద్ర నిర్మాణానికి కంపెనీ నిర్ణయించింది. దీనికి 2,200 కోట్లు కావాలి. అనుమతులు లభిస్తే పెట్టుబడులు సమకూర్చుకొనడం ఏమంత కష్టం కాదు. 20% పెట్టుబడిని మనం సమకూర్చితే 80% పెట్టుబడిని బ్యాంకుల ద్వారా, ఇతరత్రా సమకూర్చుకోవచ్చు.

**ప్ర కంపెనీ ఉజ్వల భవిష్యత్తు కోసం, సింగరేణీయులకు మీరు ఇచ్చే సందేశం?**

జ : మనది ఒక సుదీర్ఘ చరిత్ర గలిగి వున్న కంపెనీ. నేటి మార్కెట్‌లో ఇతరులతో ధీటుగా మనం నిలబడాలంటే నాణ్యత గల బొగ్గు ఉత్పత్తి చేయాలి. ఉత్పత్తి వ్యయం కనిష్ఠ స్థాయికి తగ్గించుకోవాలి. యంత్ర సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవాలి. ఇప్పుడు పోటీ మార్కెట్టులో మనకు ధీటుగా ఎవరూలేరు. కానీ ఏడాది, రెండేళ్లలో అనేక ప్రైవేటు, పబ్లిక్ రంగ బొగ్గు ఉత్పత్తి దారులు తయారవుతారు. కనుక ఇప్పటి నుంచే పోటీతత్వంతో వ్యాపార దృక్పదంతో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. ✦

# హైదరాబాద్ నుంచి గోదావరిఖనికి సి.ఎం.పి.ఎఫ్ కార్యాలయం తరలింపు

రామగుండం రీజియన్‌లోని కార్మికులు చాలాకాలంగా తమ సి.ఎం.పి.ఎఫ్ ఖాతాలను చూసే హైద్రాబాద్ కార్యాలయాన్ని రామగుండం ప్రాంతానికి మార్చాలని కోరుతున్నారు. వివిధ కారణాల వలన ఇది చాలా జాప్యం అయింది. ఎట్టకేలకు కార్యాలయం 2006 ఏప్రియల్‌లో ఏర్పాటైంది. కాని సిబ్బంది సరిగా ఉండక కార్మికులు ఇబ్బందుల పాలయ్యారు. హైద్రాబాద్ నుంచి ఇక్కడికి రావడానికి సిబ్బంది ఎవరూ ఇష్టపడకపోవడం దీనికి మరోకారణం. దీంతో రామగుండంలోని కార్యాలయం ఏదో పేరును మాత్రమే అన్న చందాన తయారవడంతో కార్మికులు, కార్మిక సంఘాలు ఆందోళన చెందాయి. కార్మికుల సౌకర్యార్థం సి.ఎం.పి.ఎఫ్ కార్యాలయాన్ని తప్పక రామగుండంలోనే పూర్తి స్థాయిలో నిర్వహించాలనే ప్రతిపాదన అన్నివర్గాల నుండి అధికమైంది. కాగా ఇదే సమయంలో సి.ఎం.పి.ఎఫ్ హైద్రాబాద్ కార్యాలయ సిబ్బంది నిరవధిక సమ్మెలోకి దిగారు. కార్యాలయాన్ని గోదావరిఖనికి తరలించడానికి వీల్లేదని, అంత అవసరం లేదని వారి వాదన.

అయితే కార్మిక వర్గం ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని సి.ఎం.పి.ఎఫ్ కార్యాలయాన్ని ఎట్టకేలకు అక్టోబర్ 25, 2007న రామగుండానికి పూర్తిస్థాయిలో తరలించారు. హైద్రాబాద్ కొత్తపేటలోగల సి.ఎం.పి.ఎఫ్ కార్యాలయంలోని ఫైళ్లు, కంప్యూటర్లను 7-8 వ్యాన్లలో తరలించారు. సి.ఎం.పి.ఎఫ్ శాఖ వారి అభ్యర్థన మేరకు కంపెనీ ఈ విషయంలో కొంత సహాయమందించింది. సమ్మెలో ఉన్న సిబ్బంది విధుల్లో చేరడానికి ఇష్టపడకపోవడంతో ఉన్న కొద్దిమంది సిబ్బందితోనే కార్యాలయం నడిపించడం ప్రారంభించారు. ఆ తర్వాత సి.ఎం.పి.ఎఫ్ అధికారుల కోరికపై సింగరేణి సంస్థ కొందరు ఉద్యోగులను డిప్యూటేషన్‌పై నియమించింది. దీనితో కార్యాలయం దాదాపు పూర్తిస్థాయిలో పనిచేయడం ప్రారంభించింది.

శాప్ పద్ధతిలో ఇటీవలనే తొలిసారిగా కొందరు రిటైర్డు కార్మికులకు రామగుండం సి.ఎం.పి.ఎఫ్ కార్యాలయం ద్వారా సి.ఎం.పి.ఎఫ్ సొమ్ములు చెల్లించడం జరిగింది. ఈ సందర్భంగా మన సి.జి.ఎం (పర్సనల్) శ్రీ ఎం.గంగిరెడ్డి కార్యాలయాన్ని సందర్శించి, కార్యాలయ నిర్వహణకు తమ వంతుగా మంచి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సి.ఎం.పి.ఎఫ్ రీజనల్ కమీషనర్ శ్రీ వై.హేమసుందర్‌రావు కార్యాలయ నిర్వహణకు తీసుకున్న శ్రద్ధను పలువురు ప్రశంసిస్తున్నారు. అయితే పూర్తిస్థాయి సిబ్బంది ఇంకా రానందున చెల్లింపుల విషయంలో ఏమైనా జాప్యాలు జరిగితే కార్మికులు సహృదయంతో అర్థం చేసుకోవాలని శ్రీ వై. హేమసుందర్‌రావు కోరారు. కార్మికులకు చేరువలో సి.ఎం.పి.ఎఫ్ కార్యాలయం ఏర్పాటుచేసినందుకు కార్మికవర్గం, కార్మికసంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.



**శాప్ నెట్ ద్వారా తొలిసారిగా చేయబడిన కార్మికుల నెలవారి పెన్షన్ పత్రాలను నవంబర్ 22న సి.జి.యం. పర్సనల్ శ్రీ ఎం. గంగిరెడ్డికి అందజేస్తున్న సి.యం.పి.ఎఫ్. రీజనల్ కమీషనర్ శ్రీ హేమసుందరరావు**

## సింగరేణి చరిత్రలో కొత్త అధ్యాయం

# సమ్మెలు లేని సంవత్సరంగా 2007

***సింగరేణిలో సమ్మెలు లేని సంవత్సరమా? అతిశయోక్తి కాదు - నిజం. 2007లో సింగరేణిలో ఒక్క సమ్మె కూడా జరుగలేదు. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి చేసే ఒక పెద్ద సంస్థగా కన్నా సమ్మెలు తరచూ జరిగే ఒక ప్రభుత్వరంగ సంస్థగానే చాలా మందికి సుపరిచితం. పరిశ్రమల్లో సమ్మెలు జరగడం సాధారణమే కానీ సింగరేణి పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంటుండేది. కాని 2007 సం॥లో ఒక్క సమ్మె కూడా జరగకుండా పారిశ్రామిక సంబంధాల చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి తెర తీశారు మన సింగరేణీయులు.***

సింగరేణి సంస్థలో లభ్యమై ఉన్న రికార్డు ప్రకారం చూస్తే గత 40 ఏళ్ళ కాలంలో సమ్మెలు లేని సంవత్సరం ఒక్కటంటే ఒక్కటి కూడా మనకు కన్పించదు. సమ్మెలకు కారణాలు అనేకం ఉన్నప్పటికీ సమ్మెల సంఖ్య మాత్రం ఎప్పుడూ భారీగానే ఉంటుండేది. సగటున వారానికి ఒక సమ్మె నుంచి రోజుకి ఒకటికి పైగా సమ్మెలు జరిగిన రోజులు అనేకం. ఏడాదిలో 365 రోజులుండగా సింగరేణిలో 475 సమ్మెలు జరిగిన సంవత్సరాలు (1991-92) కూడా లేకపోలేదు. 360 కి పైగా సమ్మెలు జరిగిన సంవత్సరాలు అనేకం ఉన్నాయి. 1983-84 సం॥లో 460 సమ్మెలు, 82-83 లో 453 సమ్మెలు, 1990-91లో 445, 1992-93లో 430, 1989-90 లో 435, 1984-85లో 406 సమ్మెలు ఇలా సింగరేణిలో ప్రతిరోజూ ఏదో ఒక చోట లేదా రెండు మూడు చోట్ల సమ్మెలు జరుగుతూనే ఉండేవి.

అందుకే సింగరేణి అనే పదం సమ్మె అనే పదంలో మిళితమై సామాన్య జనావళికి సమ్మె అని అనగానే 'సింగరేణి'లోనే కదా అనే భావన స్ఫురిస్తుండేది. నాటి ప్రచారసాధనాలైన రేడియో దినపత్రికల్లో కూడా నిత్యం సింగరేణి సమ్మె వార్తలు మార్మోగుతుండటం బహుశా మరో కారణం కావచ్చు. దక్షిణాది రాష్ట్రాలకు బొగ్గు అందిస్తూ, ఈ ప్రాంత ప్రగతిలో కీలకపాత్ర పోషిస్తున్న సింగరేణికి ఆ కారణంగా లభించాల్సిన ఖ్యాతి కన్నా, సమ్మెల సంస్కృతి ద్వారా సిద్ధించిన అపఖ్యాతే అధికం.

**సరిదిద్దుకొన్న తప్పుతో ప్రగతి పథం**

సింగరేణిలో సమ్మెలు జరగడానికి అనేక కారణాలున్నప్పటికీ వాటిలో కార్మిక సంఘాల మధ్యగల పోటీ కూడా ప్రధాన కారణంగా ఉంటుండేది. 5 ప్రముఖ జాతీయ కార్మిక సంఘాలతో పాటు మొత్తం 72కు పైగా వివిధ రకాల వృత్తి కార్మిక సంఘాలు సింగరేణిలో ఉండేవి. వీటన్నింటి మధ్య ఐక్యత చాలా తక్కువగా ఉంటుండేది. ఎవరికి వారు సమ్మె నోటీసులు ఇస్తుండేవారు. కనుక ఒకే విధమైన సమస్యలపై సిరీస్‌లో సమ్మెలు జరిగిన రోజులూ లేకపోలేదు. అయితే జరిగిన సమ్మెలన్నీ అనవసరమైనవని చెప్పలేం. సింగరేణిలో నేడున్న పరిస్థితి నాడు లేదు. ఏరియాల వారీగా యాజమాన్యం నిబంధనలు, పద్ధతులు అమలు జరుపుతుండేది. సమస్యల పరిష్కారం పై చొరవకన్నా తెగేదాకా లాగే విధానం ఇరు పక్షాల్లోనూ ఉంటుండేది.

| అత్యధిక సమ్మెలు జరిగిన సంవత్సరాలు (మొదటి పది) | | | | |
|---|---|---|---|---|
| క్ర.సం. | సంవత్సరం | సమ్మెల సంఖ్య | మ్యాన్‌షిఫ్ట్‌లు నష్టం | ఉత్పత్తి నష్టం (టన్నుల్లో) |
| 1. | 1991-92 | 475 | 1,422,159 | 1,353,120 |
| 2. | 1983-84 | 460 | 1,424,072 | 1,409,796 |
| 3. | 1982-83 | 453 | 1,245,129 | 1,491,635 |
| 4. | 1990-91 | 445 | 3,419,209 | 2,784,166 |
| 5. | 1989-90 | 435 | 3,223,544 | 2,455,490 |
| 6. | 1992-93 | 430 | 888,878 | 841,242 |
| 7. | 1984-85 | 406 | 1,828,028 | 1,686,580 |
| 8. | 1988-89 | 378 | 763,209 | 944,383 |
| 9. | 1979-80 | 376 | 641,251 | 702,757 |
| 10. | 1980-81 | 360 | 626,874 | 682,036 |

అనేక కార్మిక సంఘాలు ఉనికిలో ఉండటం వల్ల ఎవరితో ఒప్పందం చేసుకోవాలి, ఎవరి మాట వినాలి అన్నది యాజమాన్యానికి కొరుకుడు పడని సమస్యగా ఉంటుండేది. కార్మికుల్లో సైతం ఎవరిని నమ్మాలి, ఎవరికి బలం ఉంది అన్నది సందేహాత్మకంగా ఉంటుండేది. ఈ గందరగోళాన్ని నివారించడానికి యాజమాన్యం ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకొంది. సింగరేణి చరిత్రలో తొలిసారిగా గుర్తింపు కార్మిక సంఘాలకు 1998లో ఎన్నికలు నిర్వహించింది. మొదటి ఎన్నికల్లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (AITUC) గుర్తింపు కార్మిక సంఘం హోదా పొందింది. సింగరేణిలో ఉన్న 12 ఏరియాల్లోనూ ఏరియాల వారీగా ప్రాతినిధ్య సంఘాలనూ గుర్తించారు. కార్మికుల సమస్యలు ఏమైనా సరే ఈ సంఘాల ద్వారానే ప్రాతినిధ్యం జరపాలన్న నిబంధనలు విధించడంతో పారిశ్రామిక సంబంధాల్లో పెనుమార్పులు వచ్చాయి. సమ్మెల సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఎన్నికలకన్నా ముందు 1997-98లో 355 సమ్మెలు జరగ్గా 1998-99లో 124 జరిగాయి. 1999-2000లో ఇది 98 కి దిగింది. 2000-01లో 47, 2002-03లో 35, 2003-04లో 15, 2004-05లో 14, 2005-06లో 11కి, 2006-07 లో 3కు తగ్గిపోయాయి. 2007లో సింగరేణి మరో కొత్త చరిత్ర సృష్టిస్తూ ఒక్క సమ్మె కూడా జరగని కంపెనీగా నిలిచి అందరినీ ఆనందానికి ఆశ్చర్యానికి గురి చేసింది.

**సమ్మెలు లేకపోవడానికి కారణాలు ఎన్నో.....**

సమ్మెలు లేకపోవడానికి అనేక చర్యలు దోహదపడ్డాయి. ఎన్నికల తర్వాత గుర్తింపు కార్మిక సంఘాలు ప్రాథమిక సంఘాలతో నిర్మాణాత్మకంగా నిర్వహించబడుతున్న స్ట్రక్చర్డ్ మీటింగులు చక్కని పారిశ్రామిక శాంతిని నెలకొల్పాయి. ఈ మీటింగుల్లో వందలాది అంశాలపైన విపులంగా చర్చలు జరగడం, పరిష్కార దిశగా చర్యలు చేపట్టడంతో కార్మిక సంఘాల్లో కంపెనీపట్ల విశ్వాసం పెరిగింది. ఇవేకాక గత దశాబ్ద కాలంలో (1998-2008) తీసుకొన్న వివిధ రకాల సంక్షేమ కార్యక్రమాలు, కార్మిక హిత పద్ధతులు కూడా కార్మికుల ఆలోచన ధోరణిలో పెనుమార్పులు తీసుకొచ్చాయి. వీటిలో కొన్ని...

1) **పారదర్శకత**
2) **కార్మికుల వద్దకు యాజమాన్యం**
3) **సేవాసమితి కార్యక్రమాలు**
4) **పెరిగిన సంక్షేమ కార్యక్రమాలు**
5) **మంచి సమాచార, అవగాహన పద్ధతులు**

**పారదర్శకత :** 1998కి పూర్వం కంపెనీకి సంబంధించిన విషయాలేమీ కార్మికులకు తెలిసేవి కావు. దీనివల్ల కంపెనీ ఆర్థిక విషయాలు, లాభనష్టాల గురించి కార్మికులకు అస్సలు అవగాహనే ఉండేది కాదు. కనుక అపోహలు ప్రబలి సమ్మెలకు దారితీస్తుండేవి. 1998లో నాటి ఛైర్మన్ అండ్ ఎమ్.డి. శ్రీ ఎ.పి.వి.ఎన్. శర్మ కార్మికులకు కంపెనీ సంగతులన్నీ పారదర్శకంగా వివరించినపుడే వారినుంచి సహకారం లభించగలదని భావించారు. కంపెనీ పరిస్థితులన్నీ వివరించడానికి మల్టీడిపార్టుమెంట్ టీములను ఏర్పాటు చేసి, వాటిని ప్రతీ గనికి పంపించి దాదాపు లక్షమంది కార్మికులకు నేరుగా వాస్తవాలు వివరించారు. ఇది కార్మికుల దృక్పథాన్ని సమూలంగా మార్చి వేసింది. నష్టాల్లో మునిగిపోనున్న సింగరేణిని కాపాడుకోవాలనే కొత్త ఆలోచనను అందరిలో కల్గించింది.

**కార్మికుల వద్దకు యాజమాన్యం :** కార్మికుల నివాసకాలనీల్లో సమస్యలు పరిష్కరించకపోవడం వల్ల కూడా అనేక సమ్మెలు జరిగాయి. తన సమస్యను తీసుకొని కార్మికుడు యాజమాన్యం దగ్గరికి వెళ్ళి మొరపెట్టుకొనే పద్ధతికి భిన్నంగా మణుగూరులో ఒక వినూత్నమైన కార్యక్రమాన్ని నాటి జనరల్ మేనేజర్ (నేటి డైరెక్టర్ ఆపరేషన్స్) శ్రీ జె.వి.

దత్తాత్రేయులు చేపట్టారు. స్వయంగా కార్మికుల ఇళ్ళకు వెళ్ళి సమస్యలను ప్రత్యక్షంగా చూసి తగిన చర్యలకు ఆదేశిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచనతో 'కార్మికుల వద్దకు యాజమాన్యం' అనే కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. అలాగే ఉద్యోగపరమైన సమస్యల పరిష్కారానికి 'కార్మిక సమస్యల పరిష్కార వేదిక' అనే కార్యక్రమాన్నీ నిర్వహించారు. ఈ రెండు కార్యక్రమాలకు అనూహ్యమైన స్పందన లభించింది. నెలకొకసారి చొప్పున నిర్వహించిన ఈ కార్యక్రమాల ద్వారా కార్మికులు, వారి కుటుంబీకులు తమ సమస్యలను నేరుగా జనరల్ మేనేజర్‌కే వివరించడం, వివరించిన వారంలోగానే సమస్యలు పరిష్కారమవడంతో కార్మికుల్లో యాజమాన్యంపై సహజసిద్ధంగా పాతుకొనిపోయి ఉన్న వ్యతిరేకభావం తొలగిపోవడం ప్రారంభించింది. ఈ కార్యక్రమం మణుగూరులో విజయవంతం కావడంతో **నూతన కమ్యూనికేషన్ విధానం** పేరుతో దీనిని అన్ని ఏరియాలలో ప్రవేశపెట్టడం జరిగింది. అన్ని ఏరియాలలో జనరల్ మేనేజర్ స్థాయి అధికారులు కార్మికుల ఇంటింటికీ వెళ్ళి 'మీ కేమయినా సమస్యలున్నాయా చెప్పండి తీరుస్తాం' అని అడగడం పారిశ్రామిక సంబంధాల్లో పెను మార్పులకు తోవవేసింది. అంతరాలు తగ్గిపోయి, ఒకే కుటుంబం అనే భావన పెరగడానికి దోహదపడింది. మంచినీరు, డ్రైనేజీలు, వంటి సమస్యలపై ఆ తర్వాత ఎన్నడూ ఒక్క సమ్మె కూడా జరగలేదు. **(గతంలో ఇటువంటి సమస్యలపై వివిధ ఏరియాలలో సమ్మెలు జరిగిన విషయం గమనార్హం)**

**3) సేవాసమితి కార్యక్రమాలు :** 2000 సం॥లో ఏర్పడిన సింగరేణి సేవాసమితి ద్వారా వేలాదిమంది కార్మికుల పిల్లలకు ఉపాధి అవకాశ శిక్షణ ఉచితంగా అందించడం, నిరక్షరాస్యులైన కార్మికులకు, వారి భార్యలకు కూడా చదువు చెప్పించడం, పారా మిలిటరీ, పోలీసు విభాగాల్లో దాదాపు 500 మందికి ఉద్యోగాలు కల్పించడం, అలాగే గృహిణులకు కుట్లు, అల్లికలు, శారీరోలింగ్ వంటి కుటీర ఉపాధి అవకాశ శిక్షణలు ఇప్పించడం కార్మిక కుటుంబాల్లో కూడా కంపెనీపై అభిమానం కల్గించేలా చేశాయి. కంపెనీ తమను కన్నబిడ్డల్లా చూసుకుంటోందన్న ఆలోచన చాలామందిలో కల్గడానికి ఈ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడ్డాయి. సింగరేణి ఎంప్లాయిస్ వైవ్స్ అసోసియేషన్ (సేవా) ద్వారా తీసుకున్న చర్యలు కార్మిక గృహిణుల్లో కంపెనీపై సదభిప్రాయాన్ని కల్గించడానికి ఉపకరించాయి.

**4) పెరిగిన సంక్షేమ కార్యక్రమాలు :** కంపెనీ 1996-97 కాలంలో నష్టాల్లో ఉన్నప్పుడు సింగరేణిలో కాలనీలన్నీ శిథిలావస్థలో ఉండేవి. తారుకొట్టుకు పోయిన రోడ్లు, పాడైన డ్రైనేజీలు, సరిగా సరఫరాకాని మంచినీరు ఇలా అనేక సమస్యలుండేవి. కంపెనీ నష్టాల్లోంచి లాభాల్లోకి రావడం, అదే సమయంలో కార్మికుల వద్దకు యాజమాన్యం కార్యక్రమాలు నిర్వహించడం, పర్యవసానంగా స్పెషల్ వెల్‌ఫేర్ ఎమినిటీస్ ప్రోగ్రామ్ (స్వాప్) కింద లక్షలాది రూపాయలు సంక్షేమ కార్యక్రమాల కోసం ఖర్చుచేయడం జరిగింది. సంక్షేమ కార్యక్రమాలకు 2001-02లో రూ. 286 కోట్లు ఖర్చు చేయగా 2006-07లో ఇది 409 కోట్లకు పెరిగింది. కొత్త కాలనీల నిర్మాణం, పార్కులు, స్విమ్మింగ్‌పూల్స్, రోడ్లు ఇలా అనేక కార్యక్రమాలు చేపట్టడంతో కాలనీల వాసులు ఎంతో ప్రశాంతతను, భద్రతా భావాన్ని పొందగలిగారు.

**5) మంచి సమాచార, అవగాహన పద్ధతులు :** కమ్యూనికేషన్ వ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. సింగరేణిదినోత్సవాల నిర్వహణ, సింగరేణి రన్, కమ్యూనికేషన్ కార్యక్రమాలు మన టి.వి. ద్వారా వారం వారం అందించే ప్రత్యక్ష ప్రసారాలు, కార్మిక మిత్ర వ్యాన్ ద్వారా ప్రదర్శనలు, ఛైర్మన్ కార్మికులకు నేరుగా రాసే ఉత్తరాలు, సమాచార ప్రభ పోస్టర్లు, సింగరేణీయుల సమాచారం వంటివి కూడా కార్మికుల్లో మంచి ఆలోచనలు కంపెనీపై సదాభిప్రాయం ఒకే కుటుంబం భావన పెంపొందింపచేశాయి.

మొత్తం మీద చూస్తే సింగరేణిలో నేడు సమ్మెల పట్ల విముఖత దశకు కార్మికులు చేరుకున్నారు. కంపెనీ ఎదుర్కొంటున్న సవాళ్ళే తమ సవాళ్ళుగా కార్మికులు గుర్తించే స్థాయికి చేరుకున్నారు. కనుకనే అధికోత్పత్తి లక్ష్యల సాధనకు అందరూ నడుం కట్టి కృషి చేస్తూ వాటిని సాధిస్తున్నారు.

"సింగరేణిలో సమ్మెలేని సంవత్సరం గత నాలుగైదు దశాబ్దాలుగా కనిపించదు. కాని గత దశాబ్ది కాలంగా తీసుకుంటున్న అనేక చర్యల ఫలితంగా యాజమాన్యానికి, కార్మికులకు మధ్య చక్కని స్నేహభావం ఏర్పడటంతో గత ఏడాది ఒక్క సమ్మె కూడా జరగలేదు. ఇక ముందు కూడా ఇదే పరిస్థితి కొనసాగాలని ఆశిస్తున్నాను. నేటి పోటి మార్కెట్లో యాజమాన్యం కార్మికులు కలిసి ఎదుర్కోవలసిన సవాళ్ళు ఎన్నో ఉన్నాయి. ఇకపై మా పోరాటాలు కంపెనీకి ఎదురయ్యే సవాళ్ళపైనే ఉంటాయి".

**- శ్రీ ఎస్. నర్సింగ్‌రావు,** ఛైర్మన్ అండ్ యం.డి.

(హైదరాబాద్‌లో విలేఖరుల సమావేశంలో)

"అన్ని సమస్యల పరిష్కారానికి సమ్మె ఒక్కటే మూలాయుధం కాదు. చర్చలు, సంప్రదింపులు కూడా పరిష్కార మార్గాలే. సింగరేణిలో ప్రజాస్వామ్య యుతంగా గెలిచిన సంఘాలతో సంస్థాగత విషయాలు, సమస్యలు ఒక కుటుంబం మాదిరిగా చర్చించడం ఒక శుభ పరిణామం. సామరస్య పూరక వాతావరణంలో సమస్యలు పరిష్కరించబడడమే మాకు కావాల్సింది కూడా అనవసర సమ్మెలకు మేము ఎప్పుడు వ్యతిరేకులమే."

**- శ్రీ వాసిరెడ్డి సీతారామయ్య,** జనరల్ సెక్రటరీ, (ఎ.ఐ.టి.యు.సి.)

(గ్లోబలైజేషన్-కార్మిక సంఘాల పాత్ర వర్క్‌షాపులో)

## 'కొత్తగూడెం సూపర్ బజార్‌లో సూపర్ మార్కెట్'

సింగరేణి కాలరీస్ ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా 1974లో సూపర్ బజార్‌లు స్థాపించబడ్డాయి. ఇందులో ప్రస్తుతం సుమారు లక్షా ఇరవైనాలుగువేల మంది షేర్ హోల్డర్స్ ఉన్నారు. కొత్తగూడెంలో గతంలో కొద్దిపాటి సరకులతో తక్కువ స్థాయిలో ప్రారంభించిన సూపర్ బజార్‌లో ప్రస్తుతం మార్కెట్ ట్రెండ్‌కు అనుగుణంగా నాణ్యమైన, స్వచ్ఛమైన అన్ని రకాల సరకులు ఒకే దగ్గర సరసమైన ధరలకు లభ్యమయ్యేటట్లుగా ఆధునీకరిస్తున్నారు. దీనిలో భాగంగా కొత్తగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన సింగరేణి సూపర్ మార్కెట్‌ను సెప్టెంబర్ 14న సంస్థ డైరెక్టర్ (పర్సనల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్) శ్రీ ఎల్. శశిధర్, ఐ.ఏ.ఎస్ గారు ప్రారంభించారు. మొదటి కొనుగోలు చేశారు. అన్ని సరకులు తక్కువ ధరకు లభించే ఈ సింగరేణి సూపర్ మార్కెట్ సదుపాయాన్ని సింగరేణీయులందరూ సద్వినియోగం చేసుకున్నట్లయితే ఇటువంటి సూపర్ మార్కెట్లను మిగిలిన సింగరేణి ఏరియాలకు విస్తరింపచేసే అవకాశాన్ని సూపర్ బజార్ యాజమాన్యం పరిశీలిస్తున్నట్లు సూపర్ బజార్ ఎం.డి శ్రీ ఎమ్.వి. గోపీనాథ్ తెలియచేశారు. ఈ సూపర్ బజారు ద్వారా సింగరేణి సొసైటీ ఉద్యోగులెవరైనా నెలకు రూ. 1,500/- వరకు ఋణ సదుపాయం (పేషీట్ రికవరి) ద్వారా సరకులు కొనుగోలు చేసుకొనే అవకాశం కల్పించబడింది. ఈ ప్రారంభోత్సవ కార్య క్రమంలో సి.జి.ఎమ్ (ప్రాజెక్ట్-ప్లానింగ్) శ్రీ ఎమ్. శేషకుమార్ రెడ్డి, సి.జి.ఎమ్ (పర్సనల్) శ్రీ ఎమ్. గంగిరెడ్డి, సి.జి.ఎమ్. (బిజినెస్ డెవలప్‌మెంట్) శ్రీ కె.జె. అమరనాథ్, జి.ఎమ్. (ఐ.ఇ) మరియు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీ ఏ. గోపిచంద్, జి.ఎమ్ (ఇంటర్నల్ ఆడిట్) శ్రీ ఎమ్.వి. సుబ్రమణ్యం, జి.ఎమ్ (వెల్ఫేర్) శ్రీ జి. అయిలయ్య, గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏ.ఐ.టి.యు.సి) నాయకులు శ్రీ గుత్తుల సత్యనారాయణ, కార్పోరేట్ ఏరియా ప్రాతినిధ్య సంఘం నాయకులు శ్రీ జె.బి. మోహన్ మరియు శ్రీ కె. నరేష్ కుమార్, సూపర్ బజార్ కమిటీ మెంబర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



(ఫోటో చివరి కవర్ పేజిలో)

# సింగరేణి సంస్థపై అవగాహన కలిగించేందుకు “ప్రెస్ టూర్”

ఓపెన్ కాస్ట్ మరియు భూగర్భ గనుల ఉత్పత్తి ప్రక్రియ గురించి సంస్థ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై “మీడియా సిబ్బంది”కి మరింత అవగాహన కలిగించడానికి కొత్తగూడెం రీజియన్ స్థాయి “ప్రెస్ టూర్” ను సెప్టెంబర్ 12, 13 తారీఖులలో మణుగూరు మరియు ఇల్లందు ఏరియాలలో నిర్వహించారు. దీనిలో దాదాపు 50 మంది పత్రికా విలేఖరులు పాల్గొన్నారు.

విలేఖరుల బృందం ముందుగా 12వ తేదీన మణుగూరు ఏరియాకు చేరుకుంది. మణుగూరు ఏరియా యు.జి. మైన్స్ ఏజంటు శ్రీ ఎమ్.ఎస్. వెంకటరామయ్య, ఎస్.ఓ టు సి.జి.ఎమ్ శ్రీ పి బ్రహ్మానందం, పర్సనల్ మేనేజర్ శ్రీ హైదర్ అలి మీడియా బృందంలోని సభ్యులకు స్వాగతం పలికారు. అక్కడి ఇల్లందు క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఒక సమావేశంలో ఏరియా సి.జి.ఎమ్. శ్రీ బి. రమేష్ కుమార్ మణుగూరు ఏరియాకు సంబంధించిన సమాచారాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మీడియా బృందానికి వివరించారు. ఆ తర్వాత కొండాపురం కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌కు చేరుకున్న మీడియా బృందానికి మణుగూరు ఏరియా నుండి బొగ్గు రవాణా జరుగుతున్న తీరును ప్లాంట్ డి.జి.ఎమ్ (ఇ అండ్ ఎమ్) శ్రీ పి. రవిచంద్ర వివరించారు. ప్రీ-వేయ్ ట్రక్ లోడింగ్, ర్యాపిడ్ లోడింగ్ సిస్టంల గురించి మీడియా ప్రతినిధులు ఆసక్తిగా తెలుసుకున్నారు. ఆ తర్వాత అంతర్జాతీయ ప్రమాణాలను సాధించిన ఓపెన్ కాస్ట్-2 ను బృందంలోని సభ్యులు సందర్శించారు. అనంతరం కార్మికుల సంక్షేమం కోసం ప్రకాశం ఖని-1 ఇంక్లైన్‌లో ప్రవేశ పెట్టిన మ్యాన్ రైడింగ్ విధానం పై కూడా మీడియా సిబ్బందికి అవగాహన కలిగించారు. ఏరియాలోని మహిళలు మరియు నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొందడంలో సింగరేణి సేవా సమితి మరియు సేవా సభ్యులు నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మీడియా బృందం తిలకించింది.

రెండవ రోజు 13వ తేదీన ఇల్లందు ఏరియాలోని కోయగూడెం ఓపెన్ కాస్ట్‌కు చేరుకున్న మీడియా బృందంలోని సభ్యులకు ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీ కె. సూర్యనారాయణ, డివై.పి.ఎమ్ శ్రీ సాజిద్ స్వాగతం పలికారు. గనిలోని సర్ఫేస్ మైనర్ యంత్రం ద్వారా బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను ప్రత్యక్షంగా చూసి తెలుసుకున్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణకై తీసుకుంటున్న వివిధ చర్యలను కూడా మీడియావారు గమనించారు. అలాగే టేకులపల్లిలోని హైటెక్ కాలనీని సందర్శించారు. ఇల్లందులో ఏరియా జి.ఎమ్ శ్రీ ఆర్.ఎస్. మంత్రి ఏరియాకు సంబంధించిన సమాచారాన్ని విలేఖరులకు తెలిపారు. సింగరేణి సేవా సమితి ద్వారా చేపడుతున్న శిక్షణా కార్యక్రమాలను కూడా బృందంలోని సభ్యులు పరిశీలించారు. ఈ టూర్‌లో తాము కంపెనీకి సంబంధించి అనేక కొత్త విషయాలు తెలుసుకున్నామని, మరి కొన్నింటిపై సమగ్ర అవగాహన కలిగిందని టూర్‌లో పాల్గొన్న విలేఖరులు తెలిపారు. కార్పొరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం నిర్వహణలో మేనేజర్ (స్పోర్ట్స్) శ్రీ పి. రామకృష్ణారావు, జూనియర్ కమ్యూనికేషన్ ఆఫీసర్ శ్రీ వి.వి. సుబ్రహ్మణ్యం, పి.ఆర్.ఏ శ్రీ కె.వి. రమణ సహకరించారు.



ఇల్లందు కోయగూడెం ఓ.సి.లో సర్ఫేస్ మైనర్‌ను పరిశీలిస్తున్న విలేఖరులు దృశ్యం



మణుగూరులో బొగ్గు రాపిడ్ లోడింగ్ సిస్టమ్‌ను పరిశీలిస్తున్న విలేకర్లు

## బాలల దినోత్సవం సందర్భంగా సింగరేణి వ్యాప్తంగా ప్రతిభ పోటీలు



పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినమైన నవంబర్ 14 బాలల దినోత్సవం సందర్భంగా సింగరేణిలోని అన్ని ఏరియాల్లో బాలబాలికలకు ప్రతిభా పాటవ పోటీలను కమ్యూనికేషన్ సెల్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దాదాపు లక్ష రూపాయలు వెచ్చించి, నిర్వహించిన ఈ పోటీల్లో వందలాది మంది పాల్గొన్నారు. సింగరేణి ప్రాంతాల్లోని పాఠశాలలన్నింటికీ కలిపి (సింగరేణి పాఠశాలలతో సహా) ఒక విభాగంగానూ, కేవలం సింగరేణి పాఠశాలల విద్యార్థులను కలిపి ఒక విభాగంగాను పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తెలుగు భాషకు తగిన ప్రాధాన్యతను కల్పిస్తూ, తెలుగు పజిల్, తెలుగు గ్రూపు డిస్కషన్స్ నిర్వహించడం విశేషం. ఇవే కాక శాస్త్రీయ, జానపద నృత్యాలు, ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వందలాది మంది పిల్లలు పాల్గొని తమ ప్రతిభను చూపారు. ఈ పోటీలు సింగరేణి అంతటా కోలాహలంగా, ఉత్సాహంగా నిర్వహించబడ్డాయి. సింగరేణి పాఠశాలతో పాటు ఏరియాల్లోని వందలాది ప్రైవేటు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు కూడా పోటీలో పాల్గొన్నారు. బహుమతి ప్రధానోత్సవ వేడుకలను ఆయా ఏరియాల సిజిఎంలు, జనరల్ మేనేజర్లు, సేవా అధ్యక్షురాళ్లు ముఖ్యాతిథులుగా హాజరై బహుమతులు అందజేశారు.





సాంకేతిక విషయాలు

# భూగర్భ గనుల్లో విద్యుత్ పరికరాలు - కొన్ని జాగ్రత్తలు

2007 సంవత్సరమునకు రక్షణ చైతన్య సంవత్సరముగా ప్రకటించిన సందర్భములో కెటికె-3 ఇంక్లైన్, (భూపాలపల్లి)లో ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్ ఇన్‌స్టాలేషన్‌లో ఎలక్ట్రికల్ పరికరాల వినియోగము, మన్నికకై తీసుకుంటున్న ప్రత్యేక రక్షణ చర్యలు ఇలా వున్నాయి.

1) డ్రిల్‌ప్యానెల్‌ను, ఫ్యాన్ స్టార్టర్, పంప్ స్టార్టర్ క్రింద రూఫ్ బోల్ట్‌లతో స్టాండ్ తయారు చేసి స్టాండ్ మీద ఇన్‌స్టాల్ చేయటం జరుగుతున్నది.
2) డ్రిల్ ప్యానల్ సాకెట్ నుంచి ట్రయలింగ్ కేబుల్ ఊడిరాకుండా స్టాండ్‌కు క్లాంపును అమర్చటం జరిగినది.
3) ఆర్మర్ కేబుల్ టాప్‌ను (చుట్టలను) గ్రౌండ్‌లో కాకుండా, సైడ్‌కు రెండు రూఫ్ బోల్టులమీద చుట్టడం జరిగినది.
4) రూఫ్ బోల్టులతో హుక్స్ తయారు చేసి దానికి (రూఫ్‌బోల్టు నట్టుకు) వెల్డింగ్ చేసి టాప్‌లో రూఫ్ బోల్టులకు ఫిక్స్ చేసి హుకింగ్ చేయటం జరుగుతున్నది.
5) వాటర్ సీపేజీ ఉన్నచోట ప్యానల్, ఫ్యాన్, పంప్ స్టార్టర్‌ల మీద గొడుగు పెట్టడం జరుగుతున్నది.
6) ప్రతి ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్, లెవెల్లో ట్రాక్ లైన్‌కు అడ్డురాకుండా డిప్/రైస్‌లోనే ఇన్‌స్టాల్ చేయటం జరుగుతున్నది.
7) ప్రతి డిస్ట్రిక్ట్‌లో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ మరియు ఇసుక తొట్టి పెట్టడం జరుగుతున్నది.

దీనికి సంబంధించిన ఒక ఫోటోగ్రాఫ్‌ను రూపొందించి పైన తెలిసిన రక్షణ చర్యలు అందులో చూపించడం జరిగింది. పైన తెలిపిన ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్ ఇన్‌స్టాలేషన్ చేయడములో శ్రీ శంకర్, ఫోర్‌మెన్ (Elec.) చొరవ చూపించారు. వినూత్నమైన, ప్రయోజనకరమైన సూచనలు చేసిన శ్రీ శంకర్‌కు అధికారులు అభినందనలు తెలియజేశారు. పై సూచనలు పరిశీలించి అనువైన చోట తగు మార్పులతో అమలు జరుపుకోవచ్చని వారు అంటున్నారు.



# వంట గ్యాస్, పెట్రోలు పొదుపు చేద్దాం ఇలా?

**వంటగ్యాస్ పొదుపు ఇలా :**

★ చక్కని వంట విధానాలను పాటించడం ద్వారా 30 శాతం వరకూ గ్యాస్‌ను ఆదా చేయవచ్చు.
★ స్టవ్‌ను వెలిగించే ముందు వంటకు అవసరమైన సామాగ్రిని దగ్గరే ఉంచుకోండి. గిన్నెలపై సరైన మూతలను పెట్టండి. దీంతో ప్రతీ గంటకు 135 గ్రాముల గ్యాస్ వృధా కాకుండా చూసుకోవచ్చు.
★ ప్రెషర్ కుక్కింగ్ వల్ల గ్యాస్ ఆదా అవుతుంది. సాధారణ వంట విధానంతో పోలిస్తే అన్నంపై 20 శాతం, మాంసంపై 41.5 శాతం వరకూ ఆదా చేయవచ్చు.
★ సెపరేటర్లను వాడి వేర్వేరు వంటకాలను కుక్కర్లలో ఒకేసారి వండుకోండి.
★ వంటలో అధికంగా నీటిని వాడటం వల్ల గ్యాస్ వృధా అధికమవుతుంది.
★ అవసరమైన దానికన్నా అదనంగా నీటిని వాడటం వలన 65 శాతం ఇంధనం అనగా గ్యాస్ వృధా అవుతుంది.
★ పప్పులు, బియ్యం వండే ముందు వాటిని నానబెట్టండి. ఇవి త్వరగా ఉడకటం వల్ల ఇంధనం ఆదా అవుతుంది.
★ అవసరాన్ని బట్టి చిన్న బర్నర్‌ను ఉపయోగించడానికే ప్రాధాన్యం యివ్వండి దీని ద్వారా 10 శాతం గ్యాస్ ఆదా అయ్యే అవకాశం ఉంది.
★ ఐ.ఎస్.ఐ గుర్తు కలిగిన స్టౌలు మాత్రమే ఉపయోగించండి.

**వాహనాల్లో ఇంధనం ఆదా ఇలా చేయ్యొచ్చు :**

★ క్లచ్ పట్టుకొని వాహనాలు నడపకండి
★ ఎక్కడైనా వాహనాన్ని ఆపాల్సి వస్తే ఇంజన్‌ను ఆపివేయండి
★ వాహనాలను నడిపేటప్పుడు తప్పుడు విధానంలో గేర్లమార్పిడి వల్ల సుమారు 20 శాతం ఇంధనం వృధా అవుతుంది.
★ ఎయిర్ ఫిల్టర్స్ ఇంజన్‌లోకి దుమ్ము, ధూళి పోకుండా కాపాడుతుంది. తరచూ ఫిల్టర్స్‌ను శుభ్రం చెయ్యాలి.
★ టైర్లలో గాలి సరిపడినంతగా ఉండేలా చేసుకోవాలి. టైర్లలో గాలి 25 శాతం కంటే తక్కువగా ఉంటే 5-10 శాతం డీజిల్ లేదా పెట్రోలు అధికంగా ఖర్చు అవుతుంది.
★ అనవసర బరువులను వాహనాలపై వేయకండి. 50 కేజీల బరువుకు 2 శాతానికి పైగా ఇంధనం వృధా అవుతుంది.
★ రద్దీ తక్కువగా ఉన్న రోడ్లను ఎంచుకోండి, దారికాస్త దూరమైనా మైలేజీ వస్తుంది.
★ మీ వాహనాల్లో ఇంధనం లీకేజీలను గమనించండి. సెకనుకు ఒక బొట్టు చొప్పున కారినా ఏడాదికి 2 వేల లీటర్ల ఇంధనం వృధా అవుతుంది.

సేకరణ : **జి.వి.యస్. ప్రభాకరరావు,** మేనేజర్, ఎన్విరాన్‌మెంట్ సెల్, ఇల్లందు, ఖమ్మం జిల్లా

సంక్షేమంలో మరో ముందడుగు

# కాంట్రాక్టు కార్మికులకు కూడా సి.యం.పి.ఎఫ్.

**సింగరేణి కాలరీస్ కంపెనీ తన సంస్థలో పనిచేస్తున్న కార్మికులతోపాటు అవుట్ సోర్సింగ్ పనుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కూడా కనీస వేతన చెల్లింపుతోపాటు సి.ఎమ్.పి.ఎఫ్., పెన్షన్ పథకం కూడా అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. దీనివలన దాదాపు రెండు వేల మందికిపైగా కాంట్రాక్టు కార్మికులకు మేలు జరుగుతోంది.**

**సి.ఎమ్.పి.ఎఫ్. అంటే ఏమిటి?**

ప్రతి వ్యక్తి సర్వీసులో వున్నప్పుడు ఎంతో కొంత సంపాదించగలిగినా పని నుంచి దిగిపోయినప్పుడు, లేదా 60 సం॥లు పైబడిన వయసులో ఆర్థిక వెసులుబాటుకు వీలుగా, ప్రభుత్వము ఒక భవిష్యనిధిని **"కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండు (సి.ఎమ్.పి.యఫ్.) మరియు పెన్షన్ పథకము"** పేరుతో అమలులోకి తెచ్చినది.

- ఈ పథకము సింగరేణి సంస్థలోని కాంట్రాక్టు కార్మికులకందరికి సింగరేణి యాజమాన్యం వర్తింపజేసినది.

ఈ పథకము ప్రకారము సర్వీసులో వున్నప్పుడు కాంట్రాక్టు కార్మికుడు సంపాదించిన జీతములో కొంత మినహాయించి, మరికొంత కాంట్రాక్టరు (యజమాని) నుంచి తీసుకొని రెండింటి మొత్తమును కాంట్రాక్టు కార్మికునకు భవిష్యనిధిగా పొందుపరచి, ప్రతి కార్మికునికి 60 సం॥ల వయసు నిండిన తదుపరి, వడ్డీతో సహా చెల్లించబడుతుంది.

**సి.ఎమ్.పి.యఫ్. పథకము వివరాలు :**

ప్రతినెలా కాంట్రాక్టు కార్మికుని వాటా క్రింద అతని వేతనములో నుండి 15.50 శాతము మినహాయించబడుతుంది. మరియు అదనముగా కాంట్రాక్టరు (యజమాని) వాటా క్రింద 12 శాతము కాంట్రాక్ట్ కార్మికుని ఖాతాకు జమా చేయబడుతుంది.

- పై విధముగా ప్రతి నెలా కార్మికుని ఖాతాకు జమ చేయబడిన మొత్తమును కలిపి సంవత్సరానికి (అనగా ప్రస్తుత సంవత్సరం ఏప్రిల్ నుండి మరుసటి సంవత్సరం మార్చి వరకు) తన ఖాతాకు జమ చేయబడిన మొత్తమును ఆ కార్మికునకు తెలియచేయబడుతుంది.
- ప్రస్తుతము అమలులో ఉన్న ఆదేశాల ప్రకారము సభ్యుని ఖాతాలో ఉన్న మొత్తమునకు (సొమ్మునకు) 8 శాతం వడ్డీ కూడా చెల్లించబడుతుంది.

**పథకములో సభ్యత్వమునకు కనీస అర్హతలు :**

- **30 మస్టర్లు చేసిన ప్రతి కాంట్రాక్ట్ కార్మికుడు ఈ స్కీములో సభ్యుడే.**
- **పనిలో చేరిన మొదటి దినము నుండి 30 మస్టర్లు వరుసగా పూర్తిచేసినా లేదా కారణాంతరాల వలన వరుసగా పనిచేయలేకపోయినచో ఎప్పుడైతే 30 మస్టర్లు పూర్తి అవుతాయో అప్పుడు ఈ స్కీములో సభ్యత్వం పొందుటకు అర్హుడవుతాడు.**

**భవిష్యనిధి అమలు విధానము :**

- పైవిధముగా 30 మస్టర్లు పూర్తిచేసి సభ్యత్వ అర్హత పొందిన ప్రతి కాంట్రాక్టు కార్మికుడు, సి.ఎమ్.పి.యఫ్. కార్యాలయము వారు ఇచ్చిన మూడు పత్రములను పూర్తిగా పూరించి (అవసరమయిన పత్రములు కూడ జతపరచి) తను ప్రస్తుతము పనిచేయుచున్న కాంట్రాక్టరునకు (యజమానికి) అందజేయాల్సి ఉంటుంది.
- సదరు కాంట్రాక్టరు, ఆపత్రములను సివిల్ ఇంజనీరింగు డిపార్టుమెంటు వారి సహకారముతో, సి.ఎమ్.పి.యఫ్. కార్యాలయము నందు సమర్పించాల్సి ఉంటుంది.
- ఆ పత్రములను సి.ఎమ్.పి.యఫ్. కార్యాలయము వారు పరిశీలించిన తదుపరి సదరు కాంట్రాక్టు కార్మికునకు కోల్ సోషల్ సెక్యూరిటీ (సి.ఎస్.ఎన్.) నంబరు కేటాయించి ఆ కాంట్రాక్టు కార్మికునకు తెలియజేస్తారు.
- గడచిన ఆర్థిక సంవత్సరములో కార్మికుని ఖాతాలో జమ అయిన మొత్తాన్ని లెక్కలు తనిఖీ చేసిన తరువాత, సభ్యత్వం పొందిన అట్టి కార్మికునకు తన ఫోటోతో కూడిన ఒక పాసు పుస్తకము ఇవ్వబడుతుంది.
- ప్రతి ఆర్థిక సంవత్సరం తన ఖాతాకు జమ అయిన మొత్తమును, దానిపై వచ్చు వడ్డీని ఈ పాసు పుస్తకము నందు నమోదు చేయడం జరుగుతుంది.
- ప్రతి కార్మికునకు కేటాయించిన కోల్ సోషల్ సెక్యూరిటీ నెంబరు ఖాతాకి నెలనెలా రికవరీ చేసిన మొత్తాన్ని జమ చేస్తారు.
- ఒకసారి సభ్యత్వం పొందిన కార్మికుడు నెలలో ఎన్ని రోజులు పనిచేస్తే అన్ని రోజులకు వారి సి.ఎమ్.పి.యఫ్. కొనసాగుతుంది.
- **ఒక కాంట్రాక్టర్ వద్ద పనిచేసే కార్మికుడు అతని వద్ద పని మానివేసి ఇంకో కాంట్రాక్టర్ వద్ద పనిచేసినా ఈ సి.ఎమ్.పి.యఫ్. ఖాతా కొనసాగుతుంది. అయితే ఆ క్రొత్త కాంట్రాక్టర్ వద్ద పనిచేయు నప్పుడు కార్మికుడు తన సి.ఎమ్.పి.యఫ్. ఖాతా నెంబరును వారికి తెలియజేస్తే తాను ప్రస్తుతం పనిచేసిన మస్టర్లకు తన జీతము నుండి రికవరీ చేసిన పైకమును తన పాత సి.ఎమ్.పి.యఫ్. ఖాతాకే జమ చేయడం జరుగుతుంది. ఈ విధంగా ఎంతమంది కాంట్రాక్టర్ల వద్ద మారినా ఆ కార్మికుని సి.ఎమ్.పి.యఫ్. ఖాతా కొత్తగా కొనసాగుతుంది. కొత్త ఖాతా తెరువనవసరం లేదు.**

**పెన్షను :**

- పెన్షన్ పొందుటకు కనీసం 10 సం॥ల పెన్షన్‌బుల్ సర్వీసు వుండాలి. అనగా 120 (10×12)నెలలు పెన్షను ఫండుకు తమతమ ఖాతాలలో మొత్తము జమ అయి వుండాలి.
- 60 సం॥ల వయసు నిండిన తరువాత ప్రతి నెలా పెన్షన్ పొందుటకు అర్హులగుదురు.

**"కాంట్రాక్ట్ కార్మికులందరూ చట్టం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఏమైనా ఫిర్యాదులుంటే సంబంధిత సివిల్ శాఖ లేదా మాకు తెలియజేయవచ్చు. కంపెనీలో పనిచేసే కార్మికులతోపాటు కాంట్రాక్టు కార్మికులకు కూడా సి.యం.పి.ఎఫ్. వర్తింపజేయడం వారి సంక్షేమం కోసమే. కనుక దీనికి అర్హత పొందడానికి, తద్వారా లబ్ధి పొందడానికి కాంట్రాక్టు కార్మికులు ముందుకు రావాలి" - శ్రీ జె.వి. దత్తాత్రేయులు, డైరెక్టర్ ఆపరేషన్స్**

# ఎన్.ఏ.సి.లో నిరుద్యోగ యువకులకు శిక్షణ



సింగరేణి సేవ సమితి ద్వారా నిరుద్యోగులైన కార్మికుల పిల్లలకు వివిధ రకాల వృత్తి, ఉపాధి శిక్షణ కార్యక్రమాలను సింగరేణి ఏరియాల్లో ఇప్పిస్తున్న సంగతి మీకు తెలిసిందే. దీనికి అదనంగా హైదరాబాద్ నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్.ఎ.సి.) ద్వారా కూడా అనేక మందికి నిర్మాణ రంగంలో ఉద్యోగాల కోసం శిక్షణ ఇప్పించడం జరుగుతోంది. ఈ విధంగా శిక్షణ పొందినవారిలో అనేక మంది నేడు వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందారు. శ్రీరాంపూర్ ఏరియా నుంచి ఈ విధంగా శిక్షణ పొందిన సంపత్, టి. వెంకటేశ్వర్లు, రమేష్, వి. శ్రీనివాస్ అనే యువకులకు ఎన్.ఎ.సి. వారు శిక్షణానంతరం ఇచ్చిన సర్టిఫికెట్లను అందజేసి అభినందిస్తున్న శ్రీరాంపూర్ ఏరియా జి.యం. శ్రీ కె. సుగుణాకర్‌రెడ్డి.


***(ఎన్.ఎ.సి. ద్వారా ఈ విధంగా శిక్షణ పొందదలచినవారు మీ ఏరియాలో సింగరేణి సేవా సమితి కో-ఆర్డినేటింగ్ ఆఫీసర్ లేదా కో-ఆర్డినేటర్‌ను సంప్రదించవచ్చు).***

# 'రక్షణ - మన జీవన విధానంలో భాగం కావాలి'

-ఎస్.నర్సింగ్ రావు, ఛైర్మన్ అండ్ ఎండి.




"రక్షణ అనేది ఎవరో చెప్తేనే పాటించే పద్ధతి కాదు. అది మన జీవన విధానంలో భాగం కావాలి. రక్షణ గనిలోనేకాదు, నిత్య జీవితంలోను పాటించాలి. ఆ విషయంలో ఏమరుపాటుతనం, నిర్లక్ష్యం పనికిరాదు. నాకెప్పుడూ ఏమీకాలేదు, ఏమీకాదు. ప్రమాదం అనేది వేరెవరికో జరుగుతుంది. నాకు కాదు అనే భావన తొలగిపోవాలి. ప్రమాదం ఎపుడూ జరగక్కపోవచ్చు. కానీ జరగడానికి ఎంతో సమయం పట్టదు అనేది గుర్తించాలి. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలి" అని మన ఛైర్మన్ అండ్ ఎండి. శ్రీ ఎస్.నర్సింగ్‌రావు పిలుపునిచ్చారు. 42వ రక్షణ వారోత్సావాల బహుమతి ప్రధానోత్సవంలో ఆయన అధ్యక్షోపన్యాసం చేశారు.



**శ్రీ ఎం.ఎం.శర్మ**
డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ



**శ్రీ డి.ఎల్.ఆర్. ప్రసాద్**
డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్)

ఈ ఉత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ శ్రీ ఎం.ఎం.శర్మ మాట్లాడుతూ సింగరేణి సంస్థ రక్షణ విషయంలో తీసుకొంటున్న చర్యలు దేశంలోని బొగ్గు గనులన్నింటికీ ఆదర్శప్రాయమన్నారు. అలాగే అవుట్ సోర్సింగ్ విభాగాల్లో కూడా భద్రత, ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపించాలని కోరారు. మన డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ శ్రీ డి.ఎల్.ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రమాద రహిత సింగరేణి సంస్థను రూపుదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలనీ, తలుచుకుంటే అది అసాధ్యమేమీ కాదన్నారు. ప్రమాద రహితస్థాయి నుంచి గాయాల రహిత సింగరేణిని స్థాయికి ఎదిగేలా చూడాలని పిలుపునిచ్చారు. గుర్తింపు కార్మిక సంఘం ఎ.ఐ.టి.యు.సి ప్రధాన కార్యదర్శి శ్రీ వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ వర్క్‌మెన్ ఇన్స్‌పెక్టర్‌ను వారంలో రెండ్రోజులు రక్షణ పరమైన విషయాలు పరిశీలించడానికే కేటాయిస్తే మంచి ఫలితాలుంటాయన్నారు. డి.డి.జి.ఎం.ఎస్. శ్రీ ఎస్.జె.సిబాల్ మాట్లాడుతూ యూజీ గనుల్లో ప్రమాదాలు తగ్గినా, ఓసి గనుల్లో పెరగడం ఆందోళనకరమనీ, కాంట్రాక్టు విభాగంలో కూడా రక్షణ అమలుకై కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంకా శ్రీ ఇ.వి.కృష్ణారెడ్డి (డైరెక్టర్ ఫైనాన్స్) శ్రీ పి.రంగనాథ్ ఈశ్వర్ (డి.ఎం.ఎస్-రీజియన్-1), శ్రీ వి.లక్ష్మీనారాయణ (డి.ఎం.ఎస్. రీజియన్-2) తదితరులు పాల్గొన్నారు. రామగుండం-2 ఏరియా జిఎం. శ్రీ జి.రాజేందర్‌రెడ్డి తొలుత ఈ సభకు స్వాగతం పలికి, రక్షణ నివేదికను సమర్పించారు. చివరిగా బహుమతీ ప్రధానం జరిగింది. ఎస్.ఓ.టు. జి.ఎం. శ్రీ చంద్రంరాజు, కమ్యూనికేషన్ కో-ఆర్డినేటింగ్ ఆఫీసర్ శ్రీ గణాశంకర్ పూజారి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఘనంగా నిర్వహించిన ఈ ఉత్సవంలో అన్ని ఏరియాల అధికారులు, కార్మికులతోపాటు వందలాదిగా వారి కుటుంబీకులు ఉత్సాహంగా పాల్గొనడం విశేషం.

**రామగుండం 2 లోని రెవెన్యూ స్టేషన్‌లో డిసెంబర్ 11వ తేదీన జరిగిన 42వ సింగరేణి స్థాయి రక్షణ వారోత్సవాల బహుమతీ ప్రధానోత్సవ వేడుకకు ఘనంగా నిర్వహించారు. సింగరేణి రక్షణ చైతన్య సంవత్సరం జరిగిన ఈ వారోత్సవాలు అన్ని ఏరియాల్లో నిజమైన రక్షణ స్ఫూర్తిని కలిగించాయి. దీంతో గనుల మధ్య గట్టి పోటీ నెలకొంది. గతానికి భిన్నంగా ఉధృతంగా సాగిన రక్షణ సమాచారం కార్మికులు అధికారంలో కొత్త చైతన్యాన్ని తీసుకొచ్చింది. ఆ స్ఫూర్తి 42వ బహుమతి ప్రధానోత్సవంలో స్పష్టంగా కనిపించింది.**



**శ్రీ ఎస్.ఎ. సిబాల్**
డిప్యూటీ డి.జి.యం.ఎస్.



**శ్రీ వాసిరెడ్డి సీతారామయ్య**
జనరల్ సెక్రటరీ గుర్తింపు కార్మిక సంఘం

## 42 వ రక్షణ వారోత్సవాల విజేతలు వీరే

| భూగర్భ గనుల్లో | గ్రూపు ఎ | గ్రూపు బి |
|---|---|---|
| ప్రథమ బహుమతి | 21 ఇంక్లైన్-ఇల్లెందు | పి-కె-1 ఇంక్లైను మణుగూరు |
| ద్వితీయ బహుమతి | జి.డి.కె-10 ఎ | ఐ.కె.1 ఎ |
| తృతీయ బహుమతి | కె.టి.కె 5,5ఎ | 5బి ఇంక్లైన్ |
| **ఓసీ గనుల్లో** | | |
| ప్రథమ బహుమతి | ఆర్‌జి.ఓసీ-1 | మేడేపల్లి ఓసి |
| ద్వితీయ బహుమతి | పి.కె.ఓ.సి-4 | భైరిగూడ |
| **వివిధ శాఖల్లో** | **ప్రథమ** | **ద్వితీయ** |
| 1) వర్క్‌షాపులు | మణుగూరు | శ్రీరాంపూర్ |
| 2) స్టోర్సు | మణుగూరు ఓసి స్టోర్సు | ఆర్.జి-ఓసి-1 స్టోర్సు |
| 3) సి.ఎన్.పిలు | ఆర్.జి.ఓసి-1 (రామగుండం-3) | ఆర్.సి.ఎస్.పి-కొత్తగూడెం |

### ఇతర బహుమతులు

పవర్‌హౌజెస్ విభాగంలో కొత్తగూడెం పవర్‌హౌజ్, 132 కె.వి.స్టేషన్ విభాగంలో మందమర్రి 132 కె.వి. స్టేషన్, ఎం.వి.టి.సి. విభాగంలో ఎం.వి.టి.సి శ్రీరాంపూర్, రెన్యూస్టేషన్‌లో ఆర్‌ఆర్‌ఆర్‌టి-మందమర్రి స్టేషన్ ఉత్తమ బహుమతులు సాధించాయి. ఇవేకాక భూగర్భ, ఓసి గనుల్లో వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు ఇవ్వబడ్డాయి.



హాజరైన ఉద్యోగులు, మహిళలు

# జై సింగరేణి...జై జై సింగరేణి !!

ఆ నినాదం ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని సింగరేణి ప్రాంతాల్లో మార్మోగింది. వేలాదిమంది కార్మికులు, లక్షలాది కార్మిక కుటుంబీకులతోపాటు సింగరేణి ప్రాంతంలో గల ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చి సింగరేణి దినోత్సవాలలో పాల్గొన్నారు. సింగరేణిపట్ల తమకు గల ప్రేమాభిమానాలను చాటి చెప్పారు. ఈ ప్రాంతంలో జరుపుకునే ఏ పండుగకూ, జాతరకు తీసిపోని విధంగా ఈ ఉత్సావాలు  భారీ జన సమ్మర్ధంతో కొలాహాలంగా సాగాయి. పాటలు, నృత్యాలు, మంగళహారతులు, దీవెనలు, మొక్కులతో ఆధ్యంతం ఉల్లాస పూరితంగా నడిచాయి. ఈ సారి శ్రీరాంపూర్‌లో జరిగిన సెంట్రల్ ఫంక్షన్‌కు వేలాది మంది తరలిరాగా అద్భుతమైన రీతిలో ఇది విజయవంతమయింది. శ్రీరాంపూర్‌తోపాటు సింగరేణిలోని అన్ని ఏరియాల్లో జరిగిన సింగరేణి డే ఉత్సవాల చిత్రమాలిక ఇది.







శ్రీరాంపూర్ సెంట్రల్ ఫంక్షన్ దృశ్యాలు




మణుగూరులో...




కొత్తగూడెం, కార్పొరేట్‌లో...




ఇల్లందులో...




భూపాలపల్లిలో...




రామగుండం-3లో...




రామగుండం-2లో...




రామగుండం-1లో...




బెల్లంపల్లిలో...




మందమర్రిలో...

## మా...తుఝే సలామ్...వందేమాతరం

# సైనికులుగా, పోలీసులుగా 485 మంది సింగరేణి యువకులు



**సింగరేణి సేవాసమితి ద్వారా శిక్షణ పొందిన యువకులు అనేకమంది సైన్యం, పోలీసుశాఖ తదితర రక్షణ విభాగాల్లో ఉద్యోగాలు పొందుతున్నారు. వివిధ రకాల వృత్తి శిక్షణలు ఇప్పించి ఉపాధి అవకాశాలు కలగజేస్తున్న సేవాసమితి, సైన్యంలో యువకులకు ఉద్యోగాలు ఇప్పించడంలో కూడా విశేషమైన కృషి చేస్తూ కార్మికుల ప్రశంసలందుకొంటోంది. 2001 సంవత్సరంలో ప్రారంభమైన ఈ శిక్షణల ద్వారా ఇప్పటి వరకూ 485 మంది యువకులు ఉద్యోగాలు పొందడం ఒక గొప్ప విజయంగా పేర్కొనవచ్చు.**



పేరు : **బి. భానుచందర్**
ఉద్యోగం: జి.డి. సోల్జర్
తండ్రి : డేవిడ్ ఎం.వి. డ్రైవర్ గ్రూప్ వర్క్‌షాప్, మణుగూరు

పేరు : **పి. రాజేందర్**
ఉద్యోగం : సి.ఆర్.పి.ఎఫ్. కానిస్టేబుల్
తండ్రి : పి. శంకర్, కేబుల్ బాయ్ ఓ.సి.-2. రామగుండం-4

రాజేష్ 10వ తరగతి పాసయ్యాడు. ఇంటర్‌లో తక్కువ మార్కులు వచ్చాయి. చదువు అంతంత మాత్రంగానే సాగింది. కానీ ఏదో చేయాలనీ, ఉద్యోగం సాధించాలనే తపన అతన్ని వెంటాడుతుంది. సరిగ్గా అదే సమయంలో సింగరేణి సేవా సమితి ద్వారా ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరగబోతోందని తెలుసుకున్నాడు. సైన్యంలో ఉద్యోగం రావడానికి తగిన తర్ఫీదు ఉచితంగా ఇస్తారని తెలుసుకున్నాడు. ఆ రోజు సాయంత్రం సి.ఇ.ఆర్. గ్రౌండ్సులో సెలక్షన్‌కి వెళ్లాడు. తన దేహదారుఢ్యం, ఎత్తు కొలతలు సరిపోవడంతో ఎంపికయ్యాడు. 45 రోజులపాటు రోజూ ఉదయం నుంచీ ఇచ్చే శిక్షణలో పాల్గొన్నాడు. శిక్షణతోపాటు గుడ్డు, పాలు, బ్రెడ్డు వంటి సప్లిమెంటరీ ఆహారం కూడా ఇవ్వడం రాజేష్‌కు ఆశ్చర్యం కల్గించింది. శిక్షణ తర్వాత సికింద్రాబాద్‌లో జరిగిన రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొన్నాడు. హాజరైన వేలాది మందిలో తాను ఎంపికవుతానో లేదో అని భయపడ్డాడు. కానీ సేవా సమితి ద్వారా తాను పొందిన శిక్షణ తనకెంతో ఉపయోగపడటంతో ర్యాలీలో అందరికన్న ముందు నిలిచి, అన్ని పరీక్షలో నెగ్గి, ఉద్యోగానికి ఎంపికయ్యాడు. బెంగుళూరులో శిక్షణ తర్వాత నేడు జమ్మూలో బి.ఎస్.ఎఫ్.లో సైనికునిగా పోస్టింగు పొందాడు. రాజేష్ తండ్రి రాజనర్సు, తల్లిరాజమ్మ సంతోషానికి అవధుల్లేవు. పనీ పాటా లేక రోడ్లు తిరుగుతూ, బస్టాపుల్లో బాతాఖానీతో కాలం వెల్ల దీసిన కొడుకు ఏమైపోతాడోననుకొన్న వీరికి తమ కొడుకు ప్రయోజకుడవడం అవడం ఎంతో సంతోషం కలిగించింది. సింగరేణిలో ప్రతి ఏరియాలోనూ ఇటువంటి ఉదాహరణలు కోకొల్లలు.

చదువులేదు, ఉద్యోగంరాదు అని నిరాశా నిస్పృహల్లో కొట్టుమిట్టాడిన యువకులు అనేకమంది నేడు సింగరేణిసేవా సమితి ఇచ్చిన శిక్షణ ద్వారా లబ్ధిపొంది పోలీసు, సి.ఐ.ఎస్.ఎఫ్., బి.ఎస్.ఎఫ్., నేవీ, ఆర్మీ వంటి వివిధ శాఖల్లో ఉద్యోగాలు పొందారు. ఒకరిని చూసి మరొకరు స్ఫూర్తి పొందుతూ ఇప్పటికి 485 మంది ఉద్యోగాలు సాధించారు. వీరిలో చాలా మంది తమ తొలి ప్రయత్నాల్లో విఫలమైనా, తర్వాతి ప్రయత్నాల్లో సఫలమయ్యారు. పట్టుదల, దీక్ష అంటే ఏమిటో ఈ యువకులు సాధించి చూపించారు.

### తల్లిదండ్రుల సంతోషం

ఆటో నడుపుతూనో, కాంట్రాక్టు కార్మికునిగా పనిచేస్తూనో లేక ఏదైనా షాపులో తాత్కాలికంగా ఉద్యోగం చేస్తూనో కాలం గడిపిన తమ పిల్లలు - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో పర్మినెంట్ ఉద్యోగాలు పొందడం వారి తల్లిదండ్రులను కొంత ఆశ్చర్యానికి, కొండంత సంతోషానికి గురి చేస్తున్నాయి. మరి కొంతమంది తమ పిల్లలు దేశ రక్షణలో పాలు పంచుకోవడం తమకెంతో గర్వకారణంగా ఉందని అంటూ మనదేశం పట్ల వారికి గల అభిమానాన్ని వ్యక్తపరుస్తున్నారు. "ఈ రోజుల్లో ఏ ఉద్యోగానికైనా సరే డబ్బులు గుమ్మరించాల్సిందే ప్రైవేటు ఉద్యోగమైనా, ప్రభుత్వ ఉద్యోగమైనా ఇది తప్పడం లేదు, అటువంటిది సింగరేణి సంస్థ ఉచితంగా మా పిల్లలకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించడం మాకెంతో ఎంతో సంతోషంగా ఉంది. సింగరేణి రుణం మేం తీర్చుకోలేము" అని చేతులు జోడిస్తున్నారు మరికొందరు.

**"రిక్రూట్‌మెంట్ శాతం ఇంకా పెరగాలి. శిక్షణ తీసుకున్న వారిలో సగటున ఇప్పటి వరకు 11.22 శాతం మంది మాత్రమే ఎంపికవుతున్నారు. ఇతరులతో పోలిస్తే ఇది మెరుగైనదే కాని ఇంకా ఎంపిక శాతం పెంచి ఎక్కువ మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించటానికి నిర్ణయించాం. దీనికోసం ఇప్పటి వరకు నెలరోజులు పాటు మాత్రమే ఇస్తున్న శిక్షణను ఇప్పుడు 3 నెలలకు పెంచాం. దీనివల్ల మరిన్ని మంచి ఫలితాలుంటాయని ఆశిస్తున్నాం." - శ్రీ ఎల్. శశిధర్, డైరెక్టర్ (పా)**





పేరు : **తాడం కరుణాకర్**
ఉద్యోగం : జనరల్ డ్యూటి సోల్జర్
తండ్రి : మల్లయ్య, మాజీ కోల్ ఫిల్లర్, కె.టి.కె.-6, భూపలపల్లి



పేరు : **టి. శశిధర్**
ఉద్యోగం : ఎ.ఎం.సి., డెహ్రాడూన్
తండ్రి : టి. రాయనర్సు డ్రైవర్ అకౌంట్ ఆఫీస్, కొత్తగూడెం



పేరు : **ఎం. శ్రీధర్**
ఉద్యోగం : ఆర్.పి.ఎఫ్. కానిస్టేబుల్
తండ్రి : సత్యనారాయణ టర్నర్ ఏరియా వర్క్‌షాప్, మణుగూరు



పేరు : **మీసా చిరంజీవి**
ఉద్యోగం : సి.ఆర్.పి.ఎఫ్. కానిస్టేబుల్
తండ్రి : మీసా రాజయ్య, సర్ఫేస్ ట్రామర్ గోలేటి-1 ఇంక్లైన్, బెల్లంపల్లి



పేరు : **ఎం. విలాస్‌రావు**
ఉద్యోగం : జి.డి. సోల్జర్ (కాశ్మీర్)
తండ్రి : స్వామి రావు (సాధారణపౌరులు) భూపాలపల్లి

### యువకుల హర్షం

ఉద్యోగాలు పొందిన ప్రతీ యువకుడూ సింగరేణి సేవాసమితి అందించిన శిక్షణకు కృతజ్ఞతలు తెలుపుతున్నాడు. **"ఈ శిక్షణలో మాకు బ్రెడ్డు, పాలు కూడా ఇచ్చారు క్రమశిక్షణ నేర్పారు. ఆర్మీ ర్యాలీలో ఎదుర్కొనబోయే అంశాలను మాకు శిక్షణలోనే తర్ఫీదు ఇవ్వడంతో మాకు కొత్త అనేది ఏదీ లేకుండా పోటీలో నెగ్గగలిగాం. మాకు శిక్షణ ఇచ్చిన వారు కూడా ఎంతో శ్రమపడ్డారు. సింగరేణి సేవా సమితి సేవల వల్లనే మాకు జీవనోపాధి లభించింది"** అని తమ హర్షం వ్యక్తం చేస్తున్నారు.



యువకుని పేరు : **షేక్ ఖాసిం** ఉద్యోగం : సిగ్నల్‌మాన్, జమ్మూ
తండ్రి : షేక్ షమీముల్లా అకౌంట్స్ డిపార్ట్‌మెంట్, కొత్తగూడెం

కుటుంబ పోషణకు అతని కుమారుడు 10వ తరగతిని మధ్యలోనే మానేసి, కల్లు గీచే పనిలో దిగాడు. కానీ ఒకరోజు ఆర్మీ ర్యాలీ శిక్షణ గురించి సింగరేణి సేవాసమితి వారు గ్రామంలో చేస్తున్న మైకు ప్రచారం విని వెంటనే భూపాలపల్లి వెళ్ళి, శిక్షణలో చేరాడు. పట్టుదలతో శిక్షణ పూర్తి చేసి ఆర్మీలో ఉద్యోగం సంపాదించాడు. తద్వారా కుటుంబాన్ని ఆదుకొన్నాడు. ఆర్మీలో చేరిన తర్వాత ఒకసారి హైద్రాబాద్ వచ్చి, మన సింగరేణి సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. ఇటువంటి ఉదాహరణలు ఇంకా ఎన్నో, ఎన్నెన్నో!

### కార్మికుల పిల్లలకే కాదు. ఇతరుల పిల్లలకూ అవకాశం

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ శిక్షణల్లో కార్మికుల పిల్లలకే కాక సమీప ప్రాంతాల్లోని ప్రజల పిల్లలకు కూడా కంపెనీ అవకాశం కల్పించింది. ఈ విధంగా దాదాపు 57 మంది ఉద్యోగాలు పొందారు. ఇది వారి ఊహకు కూడా అందని విషయం. భూపాలపల్లిలోని ఒక సమీప గ్రామంలో తాటి చెట్లు గీచి జీవనం సాగించే ఒక పేద గ్రామస్థుడు మృతి చెందగా ఆ

దేశంలో చాలా సంస్థలు ఇటువంటి ఆర్మీ రిక్రూట్‌మెంట్‌కు తమ అభ్యర్థుల్ని పంపుతున్నాయి. కాని వారి రిక్రూట్‌మెంట్ శాతం 6లోపే ఉందని, సింగరేణి ద్వారా మాత్రం ఇది 11 శాతం దాటిందని ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారులు కూడా ప్రశంసిస్తున్నారు.

సింగరేణి సంస్థ ఎంతో ఔదార్యంతో సామాజిక బాధ్యతతో చేస్తున్న ఈ ఉచిత ఆర్మీ శిక్షణ కార్యక్రమం మున్ముందు కూడా మరింత విజయవంతం అవ్వాలనీ, మరెందరికో ఉపాధి కల్పించాలనీ ఆశిద్దాం.



రామగుండంలోని అన్ని ఏరియాలకు కలిపి ఇప్పటి వరకు 796 మందికి శిక్షణ ఇచ్చే అవకాశం కంపెనీ నాకు కల్పించింది. నా కృషితో పాటు పిల్లల పట్టుదల శ్రమ వల్ల వీరిలో 169 మంది ఎంపికై ఉద్యోగాలు సాధించారు. వీరిలో ముగ్గురు అమ్మాయిలు కూడ వున్నారు. ఇలా సేవ చేసే గొప్ప అవకాశం కల్పించిన సింగరేణికి సదా కృతజ్ఞుణ్ణి.

**- కె. మొండయ్య,** ఆర్మీ శిక్షకుడు, రామగుండం రీజియన్



మా ఇద్దరు పిల్లలు అబ్దుల్ అలీం, అబ్దుల్ హకీమ్‌లు సింగరేణి సేవా సమితి (రామగుండంలో) శిక్షణ పొంది ఆర్మీలో ఉద్యోగాలు సంపాదించారు. సింగరేణి సంస్థ మాకే కాక మా పిల్లలకు ఉపాధి కల్పించటం ఎంతో సంతోషంగా వుంది. సింగరేణి ఋణం తీర్చుకోలేనిది.

**- అబ్దుల్ రజాక్,** ఎల్.హెచ్.డి. ఆపరేటర్ జి.డి.కె. 6-బి ఇంక్లైన్



గతంలో చాలా మంది యువకులు నిరుద్యోగులుగా రోడ్ల వెంట కనిపిస్తుంటే బాధనిపించేది. సింగరేణి సేవా సమితి ద్వారా ఆర్మీ శిక్షణ కార్యక్రమం మొదలైన తరువాత ఇటువంటి వారందరిని శిక్షణలో చేర్పడానికి కృషి చేశాను. వీరికి కఠినమైన శిక్షణతోపాటు క్రమశిక్షణ కూడా నేర్పడం జరిగింది. ఇప్పటి వరకు మణుగూరు 85 మంది యువకులు ఉద్యోగాలు సాధించడం నాకు ఎంతో ఆనందం కలిగిస్తుంది. యువశక్తిని సన్మార్గంలో పెట్టిన కంపెనీకి ఆ యువకులతోపాటు నేను కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

**- నాగమల్లేశ్వరరావు,** ఆర్మీ శిక్షకుడు మణుగూరు ఏరియా

## సైన్యం, పోలీస్ శాఖల్లో వచ్చిన ఉద్యోగాల వివరాలు

**2001 నుంచి 2007 వరకూ ఏరియాల వారీగా ఎంపికైన వారు**

| ఏరియా పేరు | కార్మికుల పిల్లలు | ఇతరుల పిల్లలు | మొత్తం |
|---|---|---|---|
| రామగుండం రీజియన్ | 158 | 11 | 169 |
| మణుగూరు | 58 | 21 | 79 |
| శ్రీరాంపూర్ | 39 | 1 | 40 |
| భూపాలపల్లి | 19 | 19 | 38 |
| కార్పోరేట్ కొత్తగూడెం | 35 | 3 | 38 |
| బెల్లంపల్లి | 3 | 1 | 31 |
| మందమర్రి | 30 | - | 30 |
| ఇల్లందు | 27 | - | 27 |
| కొత్తగూడెం | 26 | - | 26 |

"సింగరేణి అందించిన సహకారంవల్లనే మేము ఉద్యోగం పొందగలిగాం. మాకు ఉపాధితోపాటు దేశానికి సేవచేసే అదృష్టం కలిగించిన సింగరేణికి మేము ఎప్పుడూ కృతజ్ఞులమే"

**- జి. గిరిధర్‌రావు**



**సేవా సమితి ద్వారా వివిధ శాఖల్లో ఉద్యోగాలు పొందిన వారి సంఖ్య**

| విభాగం | సింగరేణీయుల పిల్లలు | ఇతరుల పిల్లలు |
|---|---|---|
| 1. ఆర్మీ | 209 | 10 |
| 2. ఎయిర్‌ఫోర్స్ నేవి | 06 | - |
| 3. పోలీస్ | 123 | 28 |
| 4. సి.ఆర్.పి.ఎఫ్. | 30 | 06 |
| 5. సి.ఐ.ఎస్.ఎఫ్ | 26 | 04 |
| 6. ఆర్.పి.ఎఫ్. | 07 | 03 |
| 7. ఎస్.ఎస్.బి. | 08 | 05 |
| 8. బి.ఎస్.ఎఫ్./ ఐ.టి.బి.ఎస్.ఎఫ్. | 06 | 01 |

మనమూ - మన సింగరేణి

# సింగరేణిలో విజిలెన్స్ శాఖ ఏమి చేస్తుంది?

**మన సంస్థలో విజిలెన్స్ శాఖ ఉన్న విషయం చాలామంది తెలుసు కాని ఇది ఏం చేస్తుంది. కంపెనీ పురోగతిలో ఎలా సహకరిస్తుంది అనేది చాలా మందికి తెలియకపోవచ్చు. ఈ ఇంటర్వ్యూలో విజిలెన్స్ విభాగం పనితీరుపై పూర్తి సమాచారం అందిస్తున్నాం.**

**సింగరేణి కాలరీస్ కంపెనీ ఒక ప్రభుత్వ రంగ సంస్థ. ఇందులో పనిచేసే దాదాపు డెబ్బైఏడువేల మంది ఉద్యోగులు అందరూ ప్రజాసేవకులు అని అర్థం. ప్రజలే ప్రభుత్వ సంస్థలలో పెట్టుబడిదారులు. ఈ సంస్థలో అనేక విభాగాలు ఉన్నాయి. ఈ విభాగాలు సరిగా పనిచేస్తున్నాయా లేదా అనేది నిఘూవేసి పరీక్షించేదే విజిలెన్సు విభాగం. ఈ విభాగం యొక్క ప్రథమ కర్తవ్యం అవినీతిని నిరోధించటం, సంస్థకు నష్టం కలిగించేవాటిని పరిశీలించి, అట్టి మోసపూరిత యత్నాలను పసిగట్టి నష్టాల నివారణ కొరకు యాజమాన్యానికి తెలియజేయడం. విజిలెన్సు నుండి జరిపే దర్యాప్తుల వల్ల నిర్వహణ లేక ఉత్పత్తికి ఆటంకం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం మొదలైనవి ఉన్నాయి. విజిలెన్సు శాఖకు సంబంధించిన విషయాలపై సి.జి.యం. విజిలెన్స్‌తో ఇంటర్వ్యూ.**

1ప్ర. విజిలెన్సు విభాగం ఎక్కడ, ఎవరి క్రింద ఉన్నది?

జ : విజిలెన్సు విభాగం కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయములో ఉంది. ఇది ఛీఫ్ విజిలెన్సు అధికారి ఆదేశాల మేరకు పని చేస్తుంది. సింగరేణిలో డైరెక్టరు (పా) గారే ఛీఫ్ విజిలెన్సు అధికారి. ఆయన ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టరు గారికి రిపోర్టు చేస్తారు.

2 ప్ర. విజిలెన్సు విభాగంలో ఎవరు పనిచేస్తుంటారు?

జ : విజిలెన్సు అధికారిగా ప్రస్తుతం ఛీఫ్ జనరల్ మేనేజర్ (ఇ అండ్ యం) స్థాయి అధికారి ఉన్నారు. ఆయన క్రింద వివిధ డిపార్టుమెంట్లకు చెందిన ఆరుగురు అధికారులు, ఒక జూనియర్ సెక్యూరిటీ ఇన్స్పెక్టర్, ఆరుగురు విజిలెన్సు అసిస్టెంట్లు ఉన్నారు.

3 ప్ర. వీరంతా ఏమిచేస్తారు?

జ : ఛైర్మన్ గారికి లేదా ఇతర డైరెక్టర్లకు లేదా ఇతర ముఖ్య అధికారులకు మరియు జనరల్ మేనేజర్లకు వివిధ మార్గాల ద్వారా లేక వ్యక్తుల ద్వారా, ఫిర్యాదులు అందుతుంటాయి. ఇవి ముఖ్యంగా కంపెనీ ఉద్యోగులు లేక అధికారుల అవినీతిపైనగాని, డిపార్టుమెంట్లలో అజాగ్రత్తవల్ల జరిగే నష్టాల గురించి గాని అయివుండవచ్చు. వాటిని విజిలెన్సు విభాగానికి పంపుతారు.

4 ప్ర. మీకువచ్చే అన్ని ఫిర్యాదులను దర్యాప్తుకు స్వీకరిస్తారా?

జ : అవినీతి లేక అక్రమాలు లేక సంస్థకు తీవ్రనష్టం కలిగించటం, విధులలో నిర్లక్ష్యం లేదా అతిక్రమణలు, స్వలాభాపేక్షతో తీసుకొనే నిర్ణయాలు లేక చర్యలు మొదలగు ఆరోపణలు కలిగిన వాటిని మేము దర్యాప్తుకు స్వీకరిస్తాము.

5 ప్ర. మీరు ఎవరిపై దర్యాప్తు చేస్తారు?

జ : సింగరేణి కాలరీస్‌లో పనిచేసే ఉద్యోగులు మరియు అధికారులు, కంపెనీకి వస్తువులు లేదా సేవలు అందించే పరిశ్రమలు లేక సంస్థలు, కంపెనీ నుండి బొగ్గుకొనే వినియోగదారులు, కంపెనీ వ్యవహారాలతో సంబంధం కల లేదా సంస్థకు నష్టం కలిగించే ఇతరులు, వీరందరిపై తగు చర్య తీసుకొనుటకు దర్యాప్తు జరుపుతాము.

6 ప్ర. మీరు కొత్తగూడెంలోనే ఉండి దర్యాప్తు జరుపుతారా?

జ : కొత్తగూడెంలోనేకాక, సింగరేణి కాలరీస్ కంపెనీ సంస్థకు సంబంధించి అన్ని ఏరియాలకు దర్యాప్తునకు వెళ్తాము. దర్యాప్తులో భాగంగా అవసరం అయితే రాష్ట్రం లేక దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా వెళ్ళి దర్యాప్తులు జరిపిన సంఘటనలు కూడా ఉన్నాయి.

7 ప్ర. మీకు యాజమాన్యం ఎటువంటి అధికారాలు ఇచ్చింది?

జ : మేము కంపెనీ ఉద్యోగులెవరి వద్దకైనా వెళ్ళి ప్రశ్నించవచ్చు. వారి వద్దనుండి అవసరమైన సమాచారం, లిఖిత పత్రాలు, సింగరేణి కంపెనీకి సంబంధించిన ఎటువంటి రికార్డులు, ఫైళ్ళు అయినా తనిఖీ చేయవచ్చు. కంపెనీకి సంబంధించిన ఏ వస్తువులనయినా లిఖిత పూర్వకంగా రశీదు ఇచ్చి అట్టి పత్రాలు, రికార్డులు, ఫైళ్ళు, వస్తువులు తనిఖీ నిమిత్తం తీసుకోవచ్చు. సింగరేణి యొక్క స్వంత ఆస్తులు అనగా కార్యాలయాలు, భవనాలు, గనులు, క్వార్టర్లు మొదలగు వాటిలో దర్యాప్తు నిమిత్తం ఎక్కడికైనా వెళ్ళే అధికారం ఉంది.

8 ప్ర. విచారణకు ఎవరయినా సహకరించకపోయినా, స్టేట్‌మెంటు ఇవ్వకపోయినా ఏమి చేస్తారు?

జ : దానిని కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా పరిగణించి, చర్యలకు సిఫార్సు చేస్తాం.

9 ప్ర. "ఆకాశరామన్న" ఫిర్యాదులు దర్యాప్తునకు స్వీకరిస్తారా?

జ : పేరు, పూర్తి అడ్రస్ ఉంటేనే దర్యాప్తునకు స్వీకరిస్తాం. ముందుగా దర్యాప్తుదారులకు ఫిర్యాదు చూపించి, ధృవీకరించమని అడుగుతాం. ఆ అడ్రస్ తప్పయినా, లేక ఆ వ్యక్తి తానుకాదని తెలిసినా, వాటిని దర్యాప్తునకు స్వీకరించం.

10 ప్ర. మీకు ఫిర్యాదు చేసిన వారిని ఏ విధంగా పరిరక్షిస్తారు?

జ : ఫిర్యాదుదారుడి పేరు, అడ్రస్ గోప్యంగా ఉంచుతాము. ఒకవేళ ఫిర్యాదుదారుడు తన ఫిర్యాదు నకలును ఇతర సంస్థలకు గానీ, వ్యక్తులకుగాని పంపితే, దానికి మేమెటువంటి బాధ్యత స్వీకరించము.

11 ప్ర. తమ ఫిర్యాదు మీద దర్యాప్తు గురించి అది ఏ దశలో ఉన్నది అనే దాని గురించి ఫిర్యాదుదారునకు తెలియజేస్తారా?

జ : దర్యాప్తు పూర్తయ్యేవరకు, అన్ని విషయాలు గోప్యంగా ఉంచుతాము. పై అధికారికి తప్ప మరెవ్వరికి ఏమీ తెలియచేయడం సాధ్యంకాదు. అలా తెలియచేస్తే, దర్యాప్తు సవ్యంగా సాగకపోవచ్చు.

12 ప్ర. దర్యాప్తు ఏ విధంగా ఉంటుంది?

జ : మేము చేసే దర్యాప్తును "ప్రాథమిక దర్యాప్తు" అంటారు. దీన్ని సాధారణంగా రెండు భాగాలుగా చేస్తాం. మొదటిది "రహస్య విచారణ". ఈ సమయంలో, ఎవరిపై దర్యాప్తు చేస్తున్నాం, ఏ విషయంపై చేస్తున్నాం అనే విషయం ఎవరికీ తెలియనివ్వం.

ఒకవేళ "రహస్య విచారణలో" ఆ ఉద్యోగిచే ఎంతో కొంత అవినీతి, తప్పుడు ప్రవర్తన జరిగిందని కాని, ఫిర్యాదులోని సంఘటనలు మొదలగునవి నిజమే అని గాని ఋజువు అయితే పూర్తిస్థాయి దర్యాప్తు" జరుపుతాం. ఇట్టి సమయంలో వివిధ వ్యక్తుల వద్ద నుండి ఆ ఫిర్యాదుకు సంబంధించిన

సమాచారం, రికార్డులు, లిఖిత పూర్వక స్టేట్‌మెంట్లు మొదలగునవి తీసుకుంటాము.

13 ప్ర. ఫిర్యాదు ఎవరిమీద ఉన్నదో వారిని కూడ విచారిస్తారా?

జ : అది సంబంధిత ఫిర్యాదు మీద ఆధారపడి ఉంటుంది. కాని ప్రాథమిక దర్యాప్తులో ఫిర్యాదు మోపబడిన వారిని తప్పని సరిగా విచారించాలనికానీ, అతడిని తన నిర్దోషిత్వం నిరూపించుకొనే అవకాశం తప్పని సరిగా ఇవ్వాలనికానీ లేదు.

14 ప్ర. మరి అతనికి తనతరపున తాను తన నిర్దోషిత్వం నిరూపించుకొనే మరియు వాదించుకొనే అవకాశం ఎప్పుడు దొరుకుతుంది?

జ : పూర్తిస్థాయి "డిపార్టుమెంటల్ విచారణ"లో అట్టి అవకాశం పూర్తిగా మరియు నిష్పక్షపాతంగా తప్పక ఇవ్వబడుతుంది. ఇట్టి విచారణ ఛార్జ్ మెమో ఇచ్చిన తరువాత జరుపబడుతుంది.

15 ప్ర. 'ఛార్జి మెమో' ఇవ్వబడిన ఉద్యోగిని దోషిగా పరిగణిస్తారా?

జ : అలా పరిగణించే వీలు లేదు.

16 ప్ర. మీరు మీ ప్రాథమిక దర్యాప్తు రిపోర్టును ఎవరికి ఇస్తారు?

జ : ఛీఫ్ విజిలెన్సు అధికారి, డైరెక్టరు (పా) గారికి ఇస్తాం. ఆయన ఆ దర్యాప్తును పరిశీలించి, ఒకవేళ అట్టి విచారణపై తగిన క్రమశిక్షణా చర్య అవసరం అనుకుంటే సంబంధిత "క్రమశిక్షణాధికారికి" మా సిఫార్సులతో పంపటం జరుగుతుంది.

17 ప్ర. క్రమశిక్షణాధికారి ఎవరు?

జ : అధికారి హోదాలో ఉన్న వారికి ఛైర్మన్ మరియు మేనేజింగు డైరెక్టరు, NCWA (కార్మికులకు) ఉద్యోగులకు వారి గ్రేడులను బట్టి సంబంధిత జనరల్ మేనేజర్ లేక చీఫ్ జనరల్ మేనేజర్, లేక డైరెక్టరు (పా) గారే క్రమశిక్షణాధికారులు. ఈ వివరాలు సర్క్యులర్ P. 49/4120/IR/1036, 28.08.2001లో వివరించబడ్డాయి.

18 ప్ర. మీరు కేవలం ఫిర్యాదులు ఉంటేనే విచారణ జరుపుతారా?

జ : మా అంతట మేముగా కొన్ని సాధారణ ఇన్స్పెక్షన్లు చేస్తాము. బొగ్గు రవాణా, సి.యస్.పిలు, స్టోర్సు, పర్చేజ్, కాంట్రాక్టులు మొదలగు వాటిని, ఫిర్యాదులు లేకున్నా "చెక్" చేసి వాటిలో జరిగే లేదా జరిగే అవకాశం గల అవకతవకలను, సంబంధిత డిపార్టుమెంటు అధికారులకు తెలియజేస్తాం.

19 ప్ర. అటువంటప్పుడు కూడ క్రమశిక్షణ చర్యలు తీసుకోవచ్చా?

జ : అట్టి కొన్ని చెకింగులు, దర్యాప్తుల వల్ల క్రమశిక్షణా చర్యలు తీసుకోబడిన సంఘటనలు కూడా చాలా ఉన్నాయి.

20 ప్ర. సింగరేణీయునిగా మన బాధ్యత ఏమిటి?

జ : సింగరేణి ఉద్యోగిగా ప్రతి ఒక్కరు ఎల్లప్పుడు సత్ప్రవర్తన కలిగి ఉండాలి. అవినీతి కార్యకలాపాలకు పాల్పడరాదు.

21 ప్ర. అవినీతి నిర్మూలనలో ఉద్యోగుల బాధ్యత ఏమిటి?

జ : సంస్థలో అవినీతి నిర్మూలన కేవలం డైరెక్టరు (పా) మరియు సి.వి.ఓ. యొక్క బాధ్యత మాత్రమే కాదని, ఒక ఉద్యోగిగా తనవంతు బాధ్యత కూడా ఉందనే విషయం గ్రహించాలి.

ఉదా : తాను అవినీతికి పాల్పడక పోవడం, తన విభాగంలో అవినీతి చోటు చేసుకుంటూ వుంటే యాజమాన్యానికి / విజిలెన్స్ డిపార్టుమెంటుకు ధైర్యంగా తెలియజేయడం, డిపార్టుమెంటల్ ఎంక్వైరీలో మాట తప్పకుండ వాస్తవాలపై సాక్ష్యం చెప్పడం మొదలైనవి.

22 ప్ర. చిరునామాలేని (ఆకాశ రామన్న) లేక తప్పు చిరునామా గల ఫిర్యాదుదారుడు ఎవరో తెలిస్తే, మీరు ఏమయినా చర్యతీసుకుంటారా?

జ : తప్పుడు ఫిర్యాదులు చేసిన ఉద్యోగులపై యాజమాన్యం చర్య తీసుకుంటుందని ఎల్లప్పుడు గుర్తు పెట్టుకోవాలి.

23 ప్ర. విచారణ / క్రమశిక్షణా చర్యలు తీసుకొనే విషయంలో యాజమాన్యం అధికారులు, NCWA ఉద్యోగులు అనే విచక్షణను చూపుతోంది అన్న ఆరోపణ నిజమేనా?

జ : అవినీతిపై విచారణ / క్రమశిక్షణా చర్యలు తీసుకొనే విషయంలో యాజమాన్యం / విజిలెన్స్ విభాగం ఏ విచక్షణను చూపదు మరియు అధికారులు, NCWA ఉద్యోగులు అనే భేదం లేదని, ఉండదనీ గ్రహించాలి.

24 ప్ర. చివరిగా మన లక్ష్యం ఏమిటి?

జ : "సింగరేణిని అవినీతి రహిత సంస్థగా తీర్చిదిద్దటం" మన అందరి సమిష్టి బాధ్యత అని గుర్తు చేసుకొని అందరూ కార్యోన్ముఖులు కావాలి. ✦

## భూపాలపల్లి ఏరియాలో ఉచిత వైద్య సదుపాయాల్ని ప్రారంభించిన మన సి & ఎండి.

మన కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులకే కాకుండా సమీప గ్రామాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని వారికి కూడా ఉచిత వైద్య సదుపాయం కల్పిస్తూ తొలిసారిగా భూపాలపల్లి ఏరియాలో ఉచిత వైద్య సౌకర్యం ఇవ్వడానికి కంపెనీ అంగీకరించింది. ఇటీవల స్థానిక పైలట్ కాలనీ డిస్పెన్సరీలో మన ఛైర్మన్ అండ్ ఎం.డి. శ్రీ యన్. నర్సింగరావు, భూపాలపల్లి పరిసర గ్రామ ప్రాంతాలవారికి ఉపయోగపడే విధంగా ఈ ఉచిత వైద్య సదుపాయాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా కలెక్టర్ శ్రీమతి కె. దమయంతి, డైరెక్టర్ (పి & పి) శ్రీ డి.యల్.ఆర్. ప్రసాద్, డైరెక్టర్ (పిఎడబ్ల్యు) శ్రీ ఎల్. శశిధర్, సి.యం.ఎస్. డా॥ ముకుందరావు, ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ డి. రాములు, భూపాలపల్లి ఏరియా గుర్తింపు సంఘం సెక్రటరీ శ్రీ కె. రాజ్‌కుమార్, ఇతర అధికారులు మరియు పరిసర గ్రామ ప్రజలు హాజరైనారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీమతి దమయంతి మాట్లాడుతూ భూపాలపల్లి ప్రాంతం పారిశ్రామికంగా ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోందని కాని ఇక్కడి ప్రజలకు కనీస అవసరాలు కూడా దొరకటం కష్టంగా ఉన్న తరుణంలో సింగరేణి ఛైర్మన్ గార్ని అడిగిందే తడవుగా ఇక్కడి పరిసర గ్రామ ప్రాంతాల ఆరోగ్య అవసరాలు తీర్చే నిమిత్తం ఉచిత వైద్య సదుపాయాన్ని ప్రారంభించటం ఎంతో సంతోషించ దగిన విషయమని అన్నారు. అనంతరం మన ఛైర్మన్ అండ్ ఎం.డి. శ్రీ ఎస్. నర్సింగరావు మాట్లాడుతూ వెనుకబడిన ఈ ప్రాంత అభివృద్ధికి 'షేప్' మొదలైన కార్యక్రమాల ద్వారా ఎంతో అభివృద్ధి జరిగిందని ఈ మధ్యనే ఇక్కడ 50 పడకల ఏరియా హాస్పిటల్‌ను ప్రారంభించటం జరిగిందని తెలియజేసారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి దమయంతి అభ్యర్థన మేరకు ఈ ప్రాంతం ఎంతో వెనుకబడి ఉన్న కారణంగా సింగరేణిలో ఎక్కడా లేని విధంగా ఈ ప్రాంత ప్రజల ఆరోగ్య అవసరాలు తీర్చడానికి కంపెనీ సామాజిక బాధ్యతగా సుమారు 15 సమీప గ్రామ ప్రాంతాల వారికి ఉచిత వైద్య సేవలకు అంగీకరించిందన్నారు. సింగరేణి డిస్పెన్సరీల ద్వారా అవుట్ పేషెంట్ ట్రీట్‌మెంట్‌తో పాటు, ఎమర్జన్సీ, వార్డు, మెటర్నిటి, వేసెక్టమీ ఆపరేషన్స్ మొదలైనవి ప్రస్తుతం ఒక యేదాది కాలానికి సింగరేణి కాలరీస్ ద్వారా ఉచిత వైద్య సదుపాయాన్ని కల్పించడానికి నిర్ణయించి వెనువెంటనే దీన్ని ప్రారంభిస్తున్నామని తెలియజేసారు.

(ఫోటో బ్యాక్ కవర్‌పేజీలో)

# సేవా సమితి కార్యక్రమాలు

### సేవా సమితి కార్యక్రమాలను మరింత ఉత్సాహంగా నిర్వహించాలి

మణుగూరు ఏరియాలో జీవం పోసుకున్న సింగరేణి సేవా సమితి కార్యక్రమాలను ఇంకా ఉత్సాహంగా నిర్వహించాలని ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని 'సేవా' అధ్యక్షురాలు శ్రీమతి ఇందిరాదత్తాత్రేయులు కోరారు. అక్టోబర్ 8వ తేదిన సిఇఆర్ క్లబ్‌లో 14వ బ్యాచ్ టైలరింగ్ కోర్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

మణుగూరు ఏరియా సిజియం శ్రీ బి. రమేష్ కుమార్ మాట్లాడుతూ వివిధ కోర్సులలో అభ్యర్థులు అమిత ఆసక్తి కనబర్చినప్పుడు చేయూత నివ్వడానికి సింగరేణి యాజమాన్యం అన్ని వేళలా సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముందు సేవా అధ్యక్షులు శ్రీమతి ఇందిరా దత్తాత్రేయులు ఆర్మీ ర్యాలీ శిక్షణకు జెండా ఊపి ప్రారంభించారు. శిక్షణ పొందుతున్న యువకులు ఉద్యోగాలు పొందాలని ఆశీస్సులు అందచేశారు.

ఈ కార్యక్రమంలో 12వ బ్యాచ్ టైలరింగ్‌లో శిక్షణ పొందిన 25 మంది అభ్యర్థులకు శ్రీమతి ఇందిరా దత్తాత్రేయులు సర్టిఫికెట్స్ అందచేశారు.




ఈ కార్యక్రమంలో డి.జి.యం. పర్సనల్ శ్రీ చంద్రమౌళి మణుగూరు ఏరియా సేవా అధ్యక్షురాలు శ్రీమతి విజయలక్ష్మి రమేష్ కుమార్, సెక్రటరీ. శ్రీమతి సుధారాణి బ్రహ్మానందం, గుర్తింపు సంఘ నాయకులు శ్రీ నామ వెంకటేశ్వరావు, ఏజియం శ్రీ నర్సింగరావు, ఏజియం శ్రీ ఎం.ఎస్. వెంకట్రామయ్య, డిజియం (సి) శ్రీ వసంత కుమార్, డిజియం శ్రీ సదానందం, డివైపియం శ్రీ చిత్తరంజన్ కుమార్, డివైపియం శ్రీ మురళీ సాగర్ కుమార్, సేవా సభ్యులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### కార్పోరేట్ పరిధిలోని గాజులరాజం బస్తీలో "సాఫ్ట్ టాయిస్ శిక్షణా శిబిరం" ప్రారంభం

సింగరేణి సేవాసమితి, కార్పోరేట్ ఆధ్వర్యంలో స్థానిక గాజులరాజం బస్తీలో 'సాఫ్ట్ టాయిస్ తయారీ'లో శిక్షణా కార్యక్రమాన్ని 'సేవా' అధ్యక్షురాలు శ్రీమతి ఇందిరా దత్తాత్రేయులు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సింగరేణి సేవా సమితి, సేవా మొదలయ్యాక సింగరేణి మహిళలు మరింత చైతన్య వంతులవుతున్నారన్నారు. ఈ రోజు ప్రారంభించుకుంటున్న ఈ సాఫ్ట్ టాయిస్ శిక్షణా కేంద్రంలో మహిళలు శిక్షణ పొంది వారు స్వయం ఉపాధి పొందడమే కాకుండా ఇంకొంత మందికి స్వయం ఉపాధి కల్పించాలన్నారు. గుర్తింపు కార్మిక సంఘం ఏ.ఐ.టి.యు.సి నాయకులు శ్రీ కె. విల్సన్ కృష్టఫర్ కార్పోరేట్ ఏరియా ప్రాతినిధ్య సంఘం నాయకులు శ్రీ కె. నరేష్ కుమార్ సేవాసమితి కో-ఆర్డినేటింగ్ ఆఫీసర్ శ్రీ పి. రామకృష్ణారావు, కార్పోరేట్ ఏరియా సేవా అధ్యక్షులు శ్రీ జరీనా జియాఉద్దీన్, సేవా సభ్యులు శ్రీమతి మీనా కుమారి, గాజుల రాజం బస్తీలోని సింగరేణి మహిళలు ఈ కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.



కొత్తగూడెం ఏరియాలో సాఫ్ట్ టాయిస్ తయారీ శిక్షణా కేంద్రాన్ని సేవా అధ్యక్షురాలు శ్రీమతి సత్యభాను కృష్ణయ్య సెప్టెంబర్ 19న ప్రారంభించారు. ఇలాగే గౌతంపూర్ సేవా కేంద్రంలో 12వ తేదీన మరో కేంద్రాన్ని ప్రారంభించారు.

### సింగరేణి సేవా సమితి కార్యక్రమాల సమీక్ష సమావేశం

సింగరేణి సేవా సమితి కార్యక్రమాల నిర్వహణ మణుగూరు ఏరియాలో పకడ్బందీగా జరుగుతోందని, మణుగూరు ఏరియా అన్ని ఏరియాలకు ఆదర్శంగా నిలుస్తోందని సేవా అధ్యక్షురాలు శ్రీమతి ఇందిరా దత్తాత్రేయులు అన్నారు. ది. అక్టోబర్ 8న సి.ఇ.ఆర్. క్లబ్‌లో జరిగిన సింగరేణి సేవాసమితి మరియు సింగరేణి ఎంప్లాయిస్ వైవ్స్ అసోసియేషన్ (సేవా) సభ్యుల సమీక్ష సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు.



శ్రీరాంపూర్‌లో శారీ రోలింగ్ శిక్షణ ప్రారంభిస్తున్న శ్రీమతి సుజని సుగుణాకర్‌రెడ్డి



భూపాలపల్లిలో బ్యూటీషన్ కోర్సు ప్రారంభోత్సవంలో ఏరియా జి.యం. శ్రీ డి. రాములు తదితరులు

ఈ సమావేశంలో గత సంవత్సరంలో జరిగిన కార్యక్రమాలు మరియు ప్రస్తుత సంవత్సరంలో చేపట్టవలసిన కార్యక్రమాలను సమీక్షించారు. మణుగూరు ఏరియా సేవా అధ్యక్షురాలు శ్రీమతి విజయలక్ష్మి రమేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సేవా సభ్యులకు కార్యక్రమాల నిర్వహణపై సూచనలు సలహాలు ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సేవా సెక్రటరీ శ్రీమతి సుధాదేవి బ్రహ్మానందం, శ్రీమతి జె. లతా నాగమల్లేశ్వరరావు, శ్రీమతి ఆరిషా, శ్రీమతి శౌరి, శ్రీమతి లక్ష్మి గణేశ్వరి, ఇతర సేవా సభ్యులు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యం - విద్యపై కాలనీల్లో ప్రదర్శన

ఇల్లందు సేవా, సేవా సమితి వారి ఆధ్వర్యంలో ఇల్లెందు జె.కె. కాలనీలో సెప్టెంబర్ 25న పిల్లల ఆరోగ్యము - విద్య ఆవశ్యకతపై అధ్యక్షులు (సేవా) శ్రీమతి సురేఖా మంత్రి ఆధ్వర్యంలో భ్యారీ “ర్యాలీ” నిర్వహించారు.

ఈ సందర్భంగా YCOA క్లబ్‌నందు నిర్వహించిన సభలో శ్రీమతి సురేఖామంత్రి మాట్లాడుతూ పిల్లలకు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలని, పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని వివరించారు.

ఈ కార్యక్రమంలో మొదట ర్యాలీని శ్రీమతి సురేఖామంత్రి, జెండా ఊపి ప్రారంభించారు. శ్రీమతి సరళా వీరస్వామి (సెక్రటరీ, సేవా), శ్రీమతి రత్నమాలమూర్తి, ట్రెజరర్ (సేవా), డాక్టర్ విజయలక్ష్మి, సేవా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు కుట్టు మిషన్లు, రుణాల పంపిణీ

మనం ఉపాధి పొంది అభివృద్ధి చెందుతూ, మనతోటి వారిని కూడా ఆ దిశలో నడిపేందుకు కృషి చేయాలని ‘సేవా’ అధ్యక్షురాలు శ్రీమతి ఇందిరా దత్తాత్రేయులు పిలుపునిచ్చారు. ఇల్లెందు ఏరియాలో సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు శిక్షణా కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సింగరేణి సేవా ఆధ్వర్యంలో 8 మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.24 వేల చొప్పున రుణాన్ని బ్యాంకుల సహకారంతో అందజేశారు. కొవ్వొత్తుల తయారీకి గాను శ్రీమతి నాగమణి (సింగరేణి కార్మికుని భార్యకు) రూ. 50వేల రుణ సహాయ పత్రాలను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఇల్లెందు ఏరియా సేవా అధ్యక్షురాలు శ్రీమతి సురేఖ మాట్లాడుతూ... స్వయం ఉపాధి పథకాలను ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సింగరేణి మహిళలంతా అక్షరాస్యులు కావాలన్నదే సేవా లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వెల్ఫేర్ శ్రీ జి. ఐలయ్య, ఇల్లెందు ఏరియా జి.ఎం. శ్రీ ఆర్.ఎస్. మంత్రి, సేవా కార్యదర్శి శ్రీమతి సరళ తదితరులు పాల్గొన్నారు. *(ఫోటో 3వ కవర్‌పేజీలో)*

## భూపాలపల్లిలో అక్షర భారతి కార్యక్రమం

భూపాలపల్లి ఏరియాలోని “సింగరేణి కార్మికుల భార్యల సంఘం” (సేవా) ఆధ్వర్యంలో సింగరేణి ఉద్యోగుల భార్యలకు “అక్షర భారతి కార్యక్రమము”లో



భాగంగా యాదవ కాలనీ, కారల్‌మార్క్స్ కాలనీ, కాకతీయ కాలనీలలో నూతనంగా (3) మూడు అక్షరాస్యత కేంద్రాలను శ్రీమతి ఇందిర దత్తాత్రేయులు, (సేవాఅధ్యక్షురాలు) ప్రారంభించినారు. ఇప్పటికే నడుస్తున్న నాలుగు కేంద్రాలను సందర్శించి అభ్యాసకులతో వారు నేర్చుకున్న అంశాలను స్వయంగా సమీక్షించి, అభ్యాసకులను స్వయంగా ప్రోత్సహించారు.

నూతనంగా ప్రారంభించిన సెంటర్‌లలో నిరక్ష్యరాస్యులైన సింగరేణి ఉద్యోగుల భార్యలు 20 మంది చొప్పున అక్షరాభ్యాసం చేస్తారు. వీరికి పలకలను, పుస్తకాలను పంపిణీ చేసారు.

ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ అభ్యాసకులు క్రమం తప్పకుండా మూడు నెలల పాటు క్రమశిక్షణతో, పట్టుదలతో అభ్యాసం చేయవలసినదిగా శ్రీమతి ఇందిర దత్తాత్రేయులు కోరారు.

ఈ కార్యక్రమంలో సేవా భూపాలపల్లి అధ్యక్షురాలు శ్రీమతి పుష్పా రాములు ఇంకా శ్రీమతి రజని వసంతకుమార్, శ్రీమతి సంధ్య, దేవికుమార్, శ్రీమతి ప్రవీణ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి శ్యామల సెక్రటరీ, పాల్గొన్నారు.

## గోలేటిలో ‘మన టీవి’ ప్రసారాలు ప్రారంభం

అక్టోబర్ 10న బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లో స్థానిక సిటీకేబుల్ కార్యాలయంలో, సింగరేణి యాజమాన్యం నూతనంగా నెలకొల్పిన “మనటీవి” ప్రసార వ్యవస్థను, జనరల్ మేనేజర్ శ్రీ సి.వి.రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ సి.వి.రెడ్డి మాట్లాడుతూ, “మనటీవి’ ద్వారా ప్రతి ఆదివారం ఉదయం 11 గం॥ నుండి 12 గం॥ వరకు మన ‘సింగరేణి’ కార్యక్రమాలు ప్రసారమౌతాయని, ఈ కార్య క్రమాలలో సింగరేణి వ్యాప్తంగా జరుగుతున్న విశేషాలు, మరియు వివిధ అంశాలపై టెలీఫిల్మ్‌లు ప్రసారమౌతాయని,



మణుగూరులో సమీప గ్రామాల యువకుల కోసం ఉచిత మోటారు డ్రైవింగ్ శిక్షణ ప్రారంభంలో ప్రసంగిస్తున్న బూర్గంపాడు ఎం.ఎల్.ఏ. పాయం వెంకటేశ్వర్లు చిత్రంలో సి.జి.యం. బి. రమేష్ కుమార్, డి.జి.యం. శ్రీ చంద్రమౌళి, శ్రీ ఎం.ఎస్. వెంకట్రామయ్య తదితరులు



రామగుండం-2లో యువతులకు ఉచిత కంప్యూటర్, డి.టి.పి. శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సేవ అధ్యక్షురాలు శ్రీమతి వసుధ రాజేందర్‌రెడ్డి

ఉద్యోగులు ఈ కార్యక్రమాలను చూసి, సంస్థ గురించి, సామాజిక, ఆర్థిక, ఆరోగ్య అంశాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ అటికేటి రాజయ్య (ఎస్.ఓ. టు జి.యం.) శ్రీ బి. జయప్రకాశ్ (పర్సనల్ మేనేజర్), శ్రీ కావేటి సమ్మయ్య సిటీకేబుల్ ప్రతినిధి, "సేవాసభ్యులు", శ్రీ తిరుపతి, (ఎ.ఐ.టి.యు.సి.) నాయకులు, శ్రీ శ్రీనివాస్ (టి.బి.జి.కె.ఎస్.) నాయకులు, మరియు సింగరేణి ఉద్యోగులు పాల్గొన్నారు.

### "సేవా" బెల్లంపల్లి ఆధ్వర్యంలో 'పొదుపు' పై అవగాహన సదస్సు

సింగరేణి ఎంప్లాయీస్ వైవ్స్ అసోసియేషన్ బెల్లంపల్లి, ఆధ్వర్యంలో తేది అక్టోబర్ 9న, మాదారం మరియు గోలేటి టౌన్‌షిప్‌లలో "పొదుపు" పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. బెల్లంపల్లి, "సేవా" అధ్యక్షులు, శ్రీమతి అరుణారెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి శ్రీ సి.వి. రెడ్డి, జనరల్ మేనేజర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ సి.వి. రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం ఉద్యోగులలో పొదుపుపట్ల అవగాహన బాగానే ఉన్నా, ఇంకా కొంతమందిలో మార్పురాలేదని, అటువంటి వారిలో మార్పు రావలసిన అవసరం ఉందన్నారు. శ్రీమతి అరుణారెడ్డి మాట్లాడుతూ, అన్ని వస్తువుల ధరలు రోజు రోజుకు పెరిగి పోతున్నాయని, అన్నిటికన్నా ముఖ్యంగా పిల్లలను ఉన్నత చదువులు చదివించటానికి ఎక్కువ మొత్తంలో డబ్బులు ఖర్చు చేయవలసి వస్తున్నందున 'పొదుపు' చేయటం తప్పనిసరి అన్నారు. శ్రీ మహమ్మద్ అబ్బాస్, డి.జి.యం. (పర్సనల్) శ్రీ బి. జయప్రకాశ్, పర్సనల్ మేనేజర్, శ్రీ ఆర్.ఆర్.కె.చారి, సీనియర్ పి.ఓ. సేవాసభ్యులు పాల్గొన్నారు. ఆ తరువాత ఉద్యోగుల కాలనీలో పాదయాత్ర నిర్వహించి, ఉద్యోగుల కుటుంబాలను స్వయంగా కలుసుకొని, "పొదుపు" ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

### 'ఆరోగ్య అవగాహనా సదస్సు'

'సేవా' బెల్లంపల్లి ఏరియా ఆధ్వర్యంలో 2007 సెప్టెంబర్ 20, 21 తేదీలలో, గోలేటి సింగరేణి హైస్కూల్‌లో పాఠశాల విద్యార్థి విద్యార్థులకు 'ఆరోగ్య అవగాహనా సదస్సు' నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియా (ఎస్.ఓ. టు జి.యం.) శ్రీ అటికేటి రాజయ్య ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సదస్సులో దాదాపు 800 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. డా॥ కృపానంద భాస్కర్, మెడికల్ ఆఫీసర్, (గోలేటి డిస్పెన్సరీ) శ్రీమతి డా॥ శ్రీదేవి, సీనియర్ మెడికల్ ఆఫీసర్, (ఏరియా హాస్పటల్) విద్యార్థులకు ఆహారపు అలవాట్లు, జీర్ణకోశ సంబంధ రుగ్మతలు, కళ్ళ విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటంలో పాటించవలసిన నియమాలపై అవగాహన కల్పించారు. అలాగే బ్లడ్‌ప్రెషర్, మధుమేహం తదితర అంశాలపై కూడా వివరించటం జరిగింది. ఈ ఆరోగ్య అవగాహనా సదస్సులో శ్రీ మహమ్మద్ అబ్బాస్, డి.జి.యం (పర్సనల్), శ్రీ బి. జయప్రకాశ్, పర్సనల్ మేనేజర్ అండ్ కరస్పాండెంట్, శ్రీమతి సొల్లు లక్ష్మి, శ్రీమతి కుందారపు శంకరమ్మ, హెడ్‌మాస్టర్ శ్రీ ఎన్. రాధాకృష్ణమూర్తి ఇతర సేవా సభ్యులు, సింగరేణి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 'సేవా' బెల్లంపల్లి ఆధ్వర్యంలో అక్షరాస్యతా కేంద్రాలు

బెల్లంపల్లి ఏరియా, గోలేటి టౌన్‌షిప్‌లో, బెల్లంపల్లి ఏరియా వారి ఆధ్వర్యంలో, నిరక్షరాస్యులైన ఉద్యోగుల భార్యలకోసం 'అక్షరాస్యతా కేంద్రాలను



ప్రారంభించటం జరిగింది. ఈ సందర్భంగా శ్రీమతి అరుణరెడ్డి 'సేవా' బెల్లంపల్లి అధ్యక్షులు మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో వెయ్యి మంది ఉద్యోగుల భార్యలను నిరక్షరాస్యులుగా, గుర్తించటం జరిగిందని, అందులో 723 మందిని ఇప్పటికే అక్షరాస్యులుగా చేశామని ఆమె తెలిపారు. అనంతరం శ్రీ సి.వి.రెడ్డి రెండు అక్షరాస్యతా కేంద్రాలను ప్రారంభించగా, శ్రీమతి అరుణరెడ్డి గారు, మహిళలకు పుస్తకాలు తదితర పాఠ్య సామాగ్రిని అందచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ మహమ్మద్ అబ్బాస్, డి.వై.జి.యం. (పర్సనల్) గారు మాట్లాడుతూ, 'సేవా' మరియు 'సేవాసమితి' ద్వారా నిర్వహించే వివిధ వృత్తి విద్యా కోర్సులను, ఉద్యోగుల మరియు మాజీ ఉద్యోగుల పిల్లలు సద్విని యోగం చేసుకోవాలనికోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ బి. జయప్రకాశ్, పర్సనల్ మేనేజర్, సేవా సభ్యులు శ్రీమతులు సొల్లు లక్ష్మి, కుందారపు శంకరమ్మ, ఇతర 'సేవా' సభ్యులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



రామగుండం-1లో గృహిణుల అక్షరాస్యత కేంద్రాన్ని ప్రారంభించి అక్షరాభ్యాసం చేయిస్తున్న డి.జి.యం. పర్సనల్ శ్రీ రంగ ప్రసాద్‌రావు



బెల్లంపల్లిలో ఉద్యోగుల భార్యలకు అక్షరాస్యత కేంద్రాలను ప్రారంభించి ప్రసంగిస్తున్న జి.యం. శ్రీ సి.వి. రెడ్డి చిత్రంలో సేవ అధ్యక్షురాలు శ్రీమతి అరుణారెడ్డి, సర్పంచ్ ఎల్లు లక్ష్మి డి.జి.యం. (పి) శ్రీ అబ్బాస్ తదితరులు

# సింగరేణి క్రీడా రంగం

## ఇల్లెందులో కంపెనీ లెవెల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్స్

కంపెనీ లెవెల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్స్ అక్టోబర్ 30, 31వ తేదీలలో రన్స్ అండ్ గోల్స్ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీలకు కొత్తగూడెం, రామగుండం మరియు బెల్లంపల్లి రీజియన్‌ల టీములు పాల్గొన్నాయి. పోటీలను జి.యం. శ్రీ ఆర్.ఎస్. మంత్రి ప్రారంభించారు.

ఈ పోటీలలో మొదటి స్థానం రామగుండం రీజియన్ టీము కైవసం చేసుకోగా బెల్లంపల్లి రీజియన్ టీము రెండవ స్థానం సాధించింది. రెండు రోజులపాటు నిర్వహించిన పోటీలలో గ్రేడు ప్రతిభ కనపర్చిన 24 మంది క్రీడాకారులను కమిటి ఎంపిక చేయడం జరిగింది. ఈ క్రీడాకారుల నుండి కోల్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంట్స్‌లో పాల్గొనడానికి సింగరేణి జట్టు ఎంపిక చేయబడింది.

ఈ సందర్భముగా టోర్నమెంట్స్ కార్యక్రమానికి శ్రీ వి. వీరాస్వామి అడిషనల్ జనరల్ మేనేజర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మొదటి మరియు రెండవ స్థానం పొందిన రామగుండం మరియు బెల్లంపల్లి టీము సభ్యులకు బహుమతి ప్రదానం చేశారు. శ్రీ వి.వి.యస్ మూర్తి డివైజియం (పి), శ్రీ కె. సారయ్య బ్రాంచ్ సెక్రటరి చేతులమీదుగా క్రీడాకారులకు మెమొంటోలు ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమానికి శ్రీ సాజిద్, డివైపియం, శ్రీ రాజ కొమరయ్య స్పోర్ట్స్ ఆఫీసర్, శ్రీ ఎ. చెన్నక్రిష్ణయ్య, హనరరీ సెక్రటరీ, శ్రీ హెచ్. రమేష్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్, శ్రీ ఎ. వెంకటేశ్వర్లు కో-ఆర్డినేటర్, క్రీడాకారులు, పురప్రజలు, కార్మికులు పాల్గొన్నారు.



జట్లను పరిచయం చేసుకుంటున్న శ్రీ ఆర్.ఎస్. మంత్రి
జనరల్ మేనేజర్ ఇల్లందు ఏరియా

### కార్పోరేట్‌లో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్

వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్, కార్పోరేట్ ఏరియా ఆధ్వర్యంలో 2007-08 వార్షిక క్రీడలను అక్టోబర్ 10న సి.జి.ఎమ్ (పర్సనల్) శ్రీ ఎమ్. గంగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ చక్కటి క్రమశిక్షణతో రాణించాలని క్రీడాకారులను కోరారు. మన సంస్థలోని ఉద్యోగుల సగటు వయస్సు 45 సంవత్సరాలకు పైబడి ఉన్నదని, ఈ తరుణంలో శారీరక ధారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. జి.ఎమ్ (వెల్ఫేర్) శ్రీ జి. అయిలయ్య మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం క్రీడలకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ప్రత్యేకించి మహిళల క్రీడలకు ఎంతో ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా మహిళలకు షటిల్ బ్యాడ్మింటన్ లోనూ, పురుషులకు టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో డివై.జి.ఎమ్ (వెల్ఫేర్) శ్రీ వై. వెంకటేశ్వర్లు, గుర్తింపు కార్మిక సంఘం (ఏ.ఐ.టి.యు.సి) డిప్యూటి జనరల్ సెక్రటరీ శ్రీ డి. శేషయ్య, కార్పోరేట్ ప్రాతినిధ్య కార్మిక సంఘం (ఐ.ఎన్.టి.యు.సి) నాయకులు శ్రీ కె. నరేష్ కుమార్, కార్పోరేట్ డబ్ల్యు.పి.ఎస్ గౌరవ కార్యదర్శి శ్రీ జి. మహేశ్వరరావు, మేనేజర్ (స్పోర్ట్స్) శ్రీ పి. రామకృష్ణారావు, స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీ జె. రాజకొమరయ్య, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్ వైజర్ శ్రీ ఎమ్.సి.పాస్ నెట్ కార్పోరేట్ డబ్ల్యు.పి.ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీ ఎస్. జూడ్, ఇతర క్రీడాకారులు పాల్గొన్నారు.




ప్రసంగిస్తున్న శ్రీ ఎం. గంగిరెడ్డి (సి.జి.యం. పర్సనల్), చిత్రంలో ఇంకా శ్రీ జి. ఐలయ్య (జి.యం. వెల్ఫేర్), శ్రీ వై. వెంకటేశ్వర్లు (డి.జి.యం. పర్సనల్) గుర్తింపు కార్మిక సంఘం (ఏ.ఐ.టి.యు.సి) డిప్యూటి జనరల్ సెక్రటరీ శ్రీ డి. శేషయ్య, కార్పోరేట్ ప్రాతినిధ్య కార్మిక సంఘం (ఐ.ఎన్.టి.యు.సి) నాయకులు శ్రీ కె. నరేష్ కుమార్,

### ఉత్సాహపూరితంగా మణుగూరులో వార్షిక క్రీడలు

2007-08 వార్షిక క్రీడలను 8-9-2007, సిఇఆర్ క్లబ్, పివి కాలనీలో మణుగూరు ఏరియా సిజియం శ్రీ బి. రమేష్ కుమార్ ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ప్రసంగిస్తూ "క్రీడాకారులు మంచి క్రీడా స్ఫూర్తితో మెలగాలని" పిలుపు నిచ్చారు. భద్రాది స్టేడియంలో క్రీడాకారులకు మంచి వసతులను కల్పించటం జరిగిందన్నారు. సింగరేణీయులు మరియు వారి కుటుంబ సభ్యులు అందరూ అధిక సంఖ్యలో క్రీడా ప్రాంగణాన్ని సద్వినియోగ పర్చుకుంటే, ఇంకా మెరుగైన వసతులను కల్పించటానికి అవకాశముందని అన్నారు.

డిజియం (పి) శ్రీ కె. చంద్రమౌళి మాట్లాడుతూ "మణుగూరు ఏరియాకు ఒక ప్రత్యేక స్థానముందని, దీనిని నిలబెట్టడానికి ప్రతి క్రీడాకారుడు నిరంతర సాధన ద్వారా ప్రతి క్రీడాంశంలో నైపుణ్యం సాధించి ఏరియాకు మంచి పేరు తీసుకురావాలని పిలుపు నిచ్చారు. శ్రీ నామ వెంకటేశ్వరరావు బ్రాంచ్ సెక్రటరీ, (AITUC) మాట్లాడుతూ "ఏరియా క్రీడాకారులు మంచి క్రీడా నైపుణ్యంతో ఆడాలని" పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పి.యం. శ్రీ హైదర్ అలీ, డివైపియం శ్రీ చిత్తరంజన్ కుమార్, వెల్ఫేర్ ఆఫీసర్స్ శ్రీ ప్రభాకర్ రెడ్డి, శ్రీ వరప్రసాద్, గుర్తింపు సంఘం నాయకులు శ్రీ రాము, శ్రీ బైరి శ్రీనివాస్, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్ వైజర్ శ్రీ జాన్ వెస్లీ, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ శ్రీ ఎన్. భాస్కర్ రావు, ఇతర క్రీడాకారులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న శ్రీ బి. రమేష్ కుమార్ (సి.జి.యం. మణుగూరు), చిత్రంలో ఇంకా చంద్రమౌళి (డి.జి.యం. పర్సనల్) గుర్తింపు కార్మిక సంఘం (ఏ.ఐ.టి.యు.సి.) బ్రాంచ్ కార్యదర్శి శ్రీ నామ వెంకటేశ్వరరావు, శ్రీ రాము

## కళాశాల విద్యార్థినులతో గిరిజన తండాల్లో సేవా శిబిరం

సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ కళాశాల (కొత్తగూడెం) విద్యార్థినులతో ఇల్లెందు ఏరియా పరిధిలో గల వివిధ గ్రామాలు, గిరిజన తండాల్లో ఎన్.ఎస్.ఎస్ సేవా శిబిరాన్ని అక్టోబర్ 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించారు.

శిబిరాన్ని ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ ఆర్.ఎస్.మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంకా శ్రీ కె.రాధాకృష్ణన్ సి.జి.ఎం. (ఎడ్యుకేషన్), శ్రీమతి బి.కస్తూరి ప్రిన్సిపాల్ (సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల) డాక్టర్ వి.వి.రమణ, ఎన్.ఎస్.ఎస్ పి.ఓ. తో పాటు కళాశాల లెక్చరర్లు శ్రీమతి వి.జానకి, కుమారి హమీమ్, కుమారి బి.టి.రమాదేవి



తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఎం.డి.ఓ, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. దాదాపు 70 మంది విద్యార్థినులు ఈ కార్యక్రమంలో పాల్గొని వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేపట్టారు.

10 రోజుల పాటు సాగిన శిబిరంలో టేకులపల్లిలో యోగ, వస్త్రదాన శిబిరం, మధ్యపాన దుష్ఫలితాలపై అవగాహన, ఎయిడ్స్-హెచ్.ఐ.వి.పై ప్రచార ర్యాలీ, గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం, పోలియో చుక్కలు వేయించడంపై అవగాహన కల్గించడంవంటి కార్యక్రమాలు చేపట్టారు. టేకులపల్లిలో నిర్మించిన జూనియర్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి సుమారు 400 పండ్ల మొక్కలు నాటారు. అలాగే కోయగూడెం, టేకులపల్లి గ్రామాల్లో సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపులో ఎన్.ఎస్.ఎస్ సభ్యులు స్వచ్ఛంద సేవలందించారు. టేకులపల్లి క్యాంపు సందర్భంగా కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖామంత్రి శ్రీమతి రేణుకాచౌదరి, ఆసుపత్రులు వైద్యసేవల శాఖామంత్రి శ్రీ వనమా వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీమతి గోనెల విజయలక్ష్మీ తదితరులు సందర్శించి విద్యార్థుల సేవలను ప్రశంసించారు.

9వ రోజున దాసీ తండాలో శ్రమదానంతో రోడ్డు నిర్మాణంలో పాల్గొన్న విద్యార్థినులు 10వ రోజున వాగొడ్డుతండాలో పేదవారికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ క్యాంపు సందర్భంగా విద్యార్థినులు ప్రతిరోజూ సాయంత్రం ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు అందరినీ అలరించాయి. మంచి కార్యక్రమాన్ని చేపట్టిన మహిళా కళాశాలకు ప్రజల నుంచి చక్కని ప్రశంసలు లభించాయి.

# భూ భ్రమణం

## చైనా కంపెనీలతో కోలిండియా జాయింట్ వెంచర్లు

దేశంలో భూగర్భ గనుల నుంచి పెద్ద ఎత్తున బొగ్గు ఉత్పత్తి చేయడానికి చైనాలోని కొన్ని ప్రభుత్వ రంగ బొగ్గు కంపెనీలతో కోలిండియా జాయింట్ వెంచర్లు చేయాలని చూస్తోంది. భారతదేశంలో ఉత్పత్తయ్యే బొగ్గులో భూగర్భ గనుల నుంచి కేవలం 45 నుంచి 50 శాతం బొగ్గు ఉత్పత్తి అవుతుండగా, చైనాలో 96 శాతం బొగ్గు భూగర్భ గనులనుంచే వస్తుంది. పెద్ద మొత్తంలో భూగర్భ గనుల నుంచి బొగ్గు తీయడంలో చైనీయులకు మంచి అనుభవం ఉంది. కనుక ఉమ్మడి భాగస్వామ్యంలో భూగర్భ గనుల నుంచి బొగ్గు ఉత్పత్తి చేయడానికి ఆసక్తి చూపుతున్నట్లు సి.ఐ.ఎల్ ఛైర్మన్ పార్థా ఎన్. భట్టాచార్య బొగ్గు మంత్రిత్వ శాఖకు లేఖ రాశారు.

– ఎకనామిక్ టైమ్స్

## దేశంలో 7శాతం పెరిగిన బొగ్గు ఉత్పత్తి
## లక్ష్యాల సాధనలో సింగరేణిదే పైచేయి

2007 నవంబర్ నెలలో దేశంలో బొగ్గు ఉత్పత్తి 7 శాతం పెరిగింది. అక్టోబర్‌లో ఇది 36.671 మిలియన్ టన్నులుండగా నవంబర్‌లో 39,200 మిలియన్ టన్నులకు పెరిగింది. నెలనెలా ఉత్పత్తి లక్ష్యాలు పెరుగుతున్నప్పటికీ కోల్ ఇండియా అనుబంధ సంస్థలైన ఇ.సి.ఎల్., బి.సి.సి.ఎల్, సి.సి.ఎల్, ఎస్.ఇ.సిలు అక్టోబర్‌లో తమ లక్ష్యాల సాధనలో భారీ తేడాతో వెనకబడ్డాయి.

సి.ఐ.ఎల్. అనుబంధ కోల్ కంపనీలు బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించలేక వెనుకబడి పోయినా, సింగరేణి కాలరీస్ సంస్థ ఒక్కటి మాత్రం తన లక్ష్యాలు సాధించడమేగాక 13.5 శాతం అధికోత్పత్తి చేసి కోలిండియా ఉత్పత్తిలో ఏర్పడిన కొరతను తీర్చింది. నవంబర్‌లో సింగరేణి తన ఉత్పత్తి లక్ష్యం 3.162 మిలియన్ టన్నులకు గాను 3.589 మిలియను టన్నులు ఉత్పత్తి చేసింది.

– కోల్ ఇన్‌సైట్ పత్రిక

## రిలయన్సు పవర్‌కు అమెరికా బొగ్గు కంపెనీ చేయూత

ప్రఖ్యాత రిలయన్సు కంపెనీ విద్యుత్తు ఉత్పాదన రంగంలోకి అడుగుపెడుతూ సంచలనం సృష్టిస్తోంది. మధ్యప్రదేశ్‌లో నిర్మించనున్న 4000 మెగావాట్ల ససాన్ అల్ట్రా మెగా పవర్ ప్రాజెక్టు కోసం అనిల్ అంబానీ గ్రూపు ఒక అమెరికా బొగ్గు కంపెనీతో భాగస్వామ్యాన్ని కోరుకొంటున్నట్లు తెలుస్తోంది. ఈ బొగ్గు బ్లాకు నుంచి బొగ్గును తవ్వి ఇవ్వడానికి, ఆ తరువాత జరిగే విద్యుత్తు ఉత్పత్తి ద్వారా వచ్చే ఆదాయం నుంచి బొగ్గు ఉత్పత్తికయ్యే ఖర్చు మినహాయించుకొనే విధంగా ఒక వినూత్న ఒప్పందం కుదుర్చుకోనున్నారు. జనవరి చివరిలో ఈ మేరకు ఒక మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ ఇరు కంపెనీల మధ్య కుదిరే అవకాశం ఉందని తెలుస్తోంది.

– డి.ఎన్.ఎ.

### విలువైన గ్రంథం .... మన పత్రిక

'సింగరేణీయుల సమాచారం' పత్రిక సంపాదక వర్గానికి నా నమస్కారములు.

ప్రత్యేక సంచికగా ఇటీవల విడుదలైన మన పత్రిక చాలా బాగుంది. కవర్ పేజీ నుండి చివరి పేజీ వరకు ఎంతో శ్రద్ధ తీసుకొని చక్కగా రూపొందించారు.

కార్మికుల రక్షణ పట్ల, కార్మిక కుటుంబాల సంక్షేమం పట్ల కంపెనీ తీసుకుంటున్న అనేక కార్యక్రమాలతోపాటు మరెన్నో 'స్ఫూర్తి' దాయకమైన విషయాలను కూర్చి విలువైన గ్రంథంలా అందించినందులకు అభినందనలు.

**అతిశయోక్తి అనుకోకపోతే... ఈసారి పత్రిక చదవడానికే కాక పట్టుకుంటే చేతికి అందాన్నీ, విలువనీ తెచ్చింది. మన పత్రిక ఇక ముందూ ఇలాగే రావాలని ఆశిస్తున్నాను.**

**- బొమ్మరాత యల్లయ్య,**
క్లర్క్, ఏరియా ఆసుపత్రి, మణుగూరు

### సింగరేణీయుల సమాచారం బాగుంది

సింగరేణీయుల సమాచారం యొక్క కొత్త ముఖచిత్ర గెటప్ చాలా బాగుంది. ఆకర్షణీయంగా అద్భుతంగా తీర్చిదిద్దారు. ఇక శీర్షికల విషయానికి వస్తే ఎడిటోరియల్, తక్షణ సవాలు, "మనము మారకుంటె మనుగడ కష్టం" ఎన్నో విషయాల్ని తెలియ చెప్పడమే కాకుండా కర్తవ్య బోధన చేసేవిగా అద్భుతంగా ఉన్నాయి. స్ఫూర్తి పట్టుదల ఆత్మ విశ్వాసానికి ప్రతీక, మహిళా అక్షరోద్యమం శీర్షికలు నిజంగా మనిషిలో పట్టుదలను, స్ఫూర్తిని పెంచేవిధంగా ఉన్నాయి. పర్యావరణ చైతన్యం శీర్షిక అద్భుతం. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరు చదవాల్సిన శీర్షిక. ఒక కవిత, చిన్న కథ, మహిళలకు సంబంధించిన అంశాలపై ఏదైనా ఒక శీర్షిక, ఆరోగ్య పరిరక్షణకు అందరూ పాటించాల్సిన దైనందిన చిట్కాలు, లేదా జాగ్రత్తలు అలాగే విద్యార్థుల క్యారియర్ గైడెన్స్‌కు సంబంధించిన శీర్షిక ఏదైనా ప్రవేశ పెట్టగలిగితే బాగుంటుందేమోనని భావిస్తూ-

అభినందనలతో

**- బి. కృష్ణమురళి**
ఎస్.ఓ.యం. క్వాలిటీ మేనేజ్‌మెంట్ రామగుండం

### పురోగమనమే మన ధ్యేయం

సింగరేణీయుల సమాచారం ప్రత్యేక సంచిలో మన ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గారి '60 సంవత్సరాల స్వతంత్ర స్ఫూర్తితో పురోగమించాలన్న' పిలుపును ప్రతి సింగరేణీయుడు అనుసరించాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా ఇదే సంచికలో 'ఒకరి దానం - మరొకరికి ప్రాణం' శీర్షికలో ఇద్దరు కార్మికుల దృష్టాంతం మనస్సును కదిలించింది. ఇలాంటి కార్మికులను గుర్తించి మానవత దృక్పథంతో ప్రతి సింగరేణీయుడు చేయూతనిచ్చి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ కథనం ద్వారా సింగరేణి సంస్థ కార్మికుల కోసం వైద్య పరంగా ఎంతటి కృషి, ఎంతటి ఆర్థిక సహాయం అందించి ఆదుకుంటున్నదో తెలిసింది. సింగరేణి వ్యాప్తంగా అక్షర ఉద్యమం ఉధృతం శీర్షికలో గణాంక వివరాలతో పాటు అక్షర కేంద్రాల పని తీరును విపులంగా వివరించారు.

**- రాళ్ళబండి రాజన్న,** క్లర్క్ శ్రీరాంపూర్ ఏరియా

సింగరేణీయుల సమాచారం ప్రత్యేక సంచిలో ముఖచిత్రం ఎడిటోరియల్ బాగున్నాయి. రెండు నెలలకొకసారి కాకుండా ప్రతి నెల దీన్ని ప్రచురిస్తే బాగుంటుంది. సింగరేణి సంస్కృతిని కాపాడుతూ దీన్ని అభివృద్ధి చేయాలి.

**- శ్రీ పూట్ల దేవాచారి,** క్లర్క్ రామగుండం-2.

సింగరేణీయుల సమాచారం పత్రిక మాకు ఎంతో నచ్చింది. ఉత్పత్తి, ఉత్పాదక, మా బాధ్యత గురించి ఎంతో తెలుసుకున్నాం. అన్ని పేజీలు కలర్‌లో ప్రచురిస్తే బాగుంటుందని నా ఉద్దేశ్యం.

**- జె. వెంకట్రామ్‌రెడ్డి.** జనరల్ మజ్దూర్ ఆర్.జి.-2

## కవితలు

### జై సింగరేణి...!

ప్రగతి దారుల వెంట-పయనించి పోతుంది
జగతి కొనియాడంగ - లాభాల నార్జించి
నడిచి పోతూఉంది - మా సింగరేణి

ఉత్పత్తినే పెంచ - ఉత్సాహముతో
ఉరకలేస్తూ ఉంది - నష్టాన్ని సరిచేసి
కష్టాన్ని దిగమింగి-ఉరి కురికి పోతుంది.
కార్మికుల క్షేమమే - మా ధ్యేమంటూ
కంకణం కట్టింది - మా సింగరేణి

కార్మికుల రక్షణే - మా లక్ష్యమంటూ
నొక్కి వక్కాణించె - మా సింగరేణి

కష్టాలు కడగండ్లు - కలకాల ముండవని
దూసుకు పోతుంది - మా సింగరేణి

ఆట పాటలయందు - కదురమ్యసీమ
ఆశయ సాధనలో - ఆదర్శమై నిలిచె
త్యాగధనుల భూమి - త్యాగాల మయము
తలవంచలేదెపుడు - తలెత్తిబ్రతికింది
మా కలల పంట, మా కంటిదీపము - మా సింగరేణి

**- టి. వీరభద్రారెడ్డి,** రామకృష్ణాపూర్

### గర్వించు కార్మికా గర్వించు

గనిలోకి వెళ్ళి భూమి పొరను చీల్చి
నల్లబంగారాన్ని వెలికి తీసి
దేశాభివృద్ధికి పాటుపడుతున్నావని గర్వించు


దేశం నాకేమిచ్చిందని దిగులుపడే వారికి
నీవు ప్రాణానికి సైతం తెగించి చేస్తున్న
సేవను తెలియచేసి గర్వించు
వారి కళ్ళు తెరిపించు

ఇంతటి గౌరవాన్ని పొందడానికీ, నీ పిల్లలకు
బంగారు బాట వేయటానికి కారణమైన "సింగరేణి"లో
నీవొక 'సింగరేణియన్'గా ఉన్నందుకు అధికంగా గర్వించు

దేశాభివృద్ధికి నీవొక
ముఖ్యమైన భూమికగల
పౌరునవని గర్వించు !

**- జయరావు జనా,** డి.వై.ఎస్.ఇ.
వి.కె.-7, కొత్తగూడెం

### ప్రకృతిని కాటేస్తున్న కాలుష్య విష సర్పం



**సింగరేణి విద్యార్థులకు నిర్వహించిన స్పాట్ పెయింటింగ్‌లో ప్రథమ బహుమతి పొందిన చిత్రం**

## హ్హా....హ్హా....హ్హా...

- ఓ ఇద్దరు వ్యక్తులు ఇలా మాట్లాడుకుంటున్నారు.
  మొదటి వ్యక్తి : మా అల్లుడు గారు ఓ కంపెనీలో ఇంజనీరుగా చేస్తున్నాడు కానీ..... ఏదైనా విషయం చెప్తే వెంటనే అర్థం చేస్కోలేడు.
  రెండవ వ్యక్తి : అలాగా! ఇంతకీ మీ అల్లుడు గారు ఏ కంపెనీలో పనిచేస్తున్నాడు?
  మొదటి వ్యక్తి : ట్యూబులైట్స్ తయారు చేసే కంపెనీలో.....

***


- పార్క్‌లో ప్రేమికులిద్దరు ఇలా మాట్లాడుకుంటున్నారు.
  "మధూ!... నువ్వెన్ని రోజులకోసారి స్నానం చేస్తావ్?"
  "రోజూ రెండు పూటలా చేస్తాను. అవునూ... ఎందుకలా అడిగావు?..."
  "ఏం లేదు. నాలుగురోజుల క్రితం నీ మెడ దగ్గర అంటుకున్న నా బొట్టుబిళ్ళ అలాగే ఉంటేనూ..."

***

- వాకింగులో ఎదురుపడ్డ రాఘవయ్య, రమణయ్య ఇలా మాట్లాడుకుంటున్నారు.
  రాఘవయ్య : మీ కొడుకూ కోడలు విడిపోయి చాలా కాలమైందటగా! అదేంటి మరి మొన్నడిగితే వాళ్ళు చిలకా గోరింకల్లా ఉన్నారన్నావ్!!
  రమణయ్య : అవును. చిలకా గోరింకలు కల్సికాపురం ఎక్కడా చెయ్యవు గనుకనే అలా అన్నాను.
  రాఘవయ్య : ఆ....!....!.......

పంపినవారు : **బొమ్మరాత యల్లయ్య**
క్లర్క్, ఏరియా ఆసుపత్రి, మణుగూరు

## సందేశ చిత్రం



**ఎస్.ఆర్. వల్లం**

**టబ్బులపై ప్రయాణం అది పరలోకానికి ప్రయాణం**

# జ్ఞాపకాల పొరలు





బొగ్గును ఉత్పత్తి చేస్తూ దక్షిణాదిని ప్రగతిమయం చేసిన మన సంస్థ అంటే అందరికీ ఎంతో ఆసక్తి ! ఈ కారణంగా మన సంస్థను అనేకమంది ప్రముఖులు సందర్శించేవారు. కొత్తగూడెంలోని 5బి ఇంక్లైన్‌ను ***జూన్ 9, 1963న*** నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి, మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ కె. కామరాజ్ నాడర్‌తోపాటు అప్పటి కేంద్ర ఉక్కు శాఖమంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం రాష్ట్ర ఆర్థిక, లఘు పరిశ్రమల శాఖమంత్రులు శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, డా॥ లక్ష్మీ నర్సయ్య సందర్శించినప్పటి చిత్రం ఇది. చిత్రంలో నాటి మన ఛైర్మన్ శ్రీ గురుస్వామి కూడా ఉన్నారు.



ఇప్పుడు మనకు సైకిళ్ళు అంటే అదేదో పాతకాలంనాటి వాహనంగా స్ఫురిస్తుంటుంది. కానీ 50 ఏళ్ల క్రితం సైకిల్ అనేదే చాలా వింతైన కొత్త రకం వాహనం. ఇది కొనుక్కోవడం, దానిపై డ్యూటికి వెళ్ళడం కూడా ఒక గొప్ప హోదాకి చిహ్నంగా వుంటుండేది (ఇప్పుడు మనం కారు కొనుక్కోవడం అంతా గొప్ప అన్నమాట!) 1963 డిసెంబర్ సంచికలో ***సైకిళ్ళపై డ్యూటీలకి వెళుతున్న మన కార్మికులు*** అంటూ కవర్ పేజీలో ఈ ఫోటో ప్రముఖంగా ప్రచురించబడింది!



*1963లో నిర్మించిన గోదావరి ఖనిలోని కార్మిక కాలనీ దృశ్యం ఇది. చెట్లు చేమలు లేక బంజరు భూమిని తలపిస్తుంది కదూ! ఇది నాడు. కాని సింగరేణి సంస్థ గత కొన్నేళ్ళుగా తీసుకుంటున్న పర్యావరణ హిత చర్యల ఫలితంగా సింగరేణిలో నేడు అన్ని కాలనీలు పచ్చధనంతో కళకళలాడుతున్న విషయం మీకు తెలిసిందే*

# మన సింగరేణి కుటుంబం

## మన సంస్కృతి



శ్రీరాంపూర్ ఏరియాలో



రామగుండం-1 లో

సింగరేణి ఎంప్లాయీస్ వైవ్స్ అసోసియేషన్ (సేవా) ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా వివిధ ఏరియాల్లో బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణా ప్రాంతంలో ప్రముఖమైన ఈ పండుగ సందర్భంగా అధికారులు, కార్మికుల భార్యలన్న తేడా లేకుండా అంతా కలిసి బతుకమ్మ ఆట-పాట కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ఒకే కుటుంబం అనే భావనను మరింతగా పెంచి, సింగరేణి కుటుంబీకుల మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తున్నాయి.

## స్వయం ఉపాధి



మణుగూరులో ఆర్మీ ర్యాలీ శిక్షణ శిబిరం ప్రారంభించిన సేవా అధ్యక్షురాలు శ్రీమతి ఇందిరా దత్తాత్రేయులు. కార్యక్రమంలో శ్రీ జి. రమేష్‌కుమార్, (సి.జి.యం.), శ్రీ చంద్రమౌళి (డి.జి.యం.-పి), శ్రీ నామవెంకటేశ్వరరావు గుర్తింపు సంఘం నాయకులు, శ్రీమతి విజయలక్ష్మి రమేష్‌కుమార్, సేవా మణుగూరు అధ్యక్షురాలు ఉన్నారు.



టైలరింగ్‌లో, ఇతర ఉపాధి శిక్షణల్లో శిక్షణ పొందినవారికి ఖాదీగ్రామోద్యోగ్ ద్వారా రుణాలు కూడా ఇప్పించడం జరుగుతోంది. ఇల్లందులో రుణాల పంపిణీలో పాల్గొన్న శ్రీమతి ఇందిర దత్తాత్రేయులు (సేవా అధ్యక్షురాలు), శ్రీమతి సురేఖ మంత్రి (ఇల్లందు సేవ అధ్యక్షురాలు) తదితరులు

## ప్రచారం-చైతన్యం



బెల్లంపల్లి ఏరియాలో సేవ ఆధ్వర్యంలో చేపట్టిన అనేక కార్యక్రమాల్లో భాగంగా పొదుపుపై కూడా కాలనీలో విస్తృత ప్రచారం చేశారు. శ్రీమతి సి.వి.రెడ్డి, సేవ అధ్యక్షురాలు, శ్రీమతి సొల్లు లక్ష్మి (సర్పంచ్), శ్రీమతి కుందారపు శంకరమ్మ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



విధులకు గైర్హాజరవుతున్న కార్మికుల్ని తిరిగి విధులకు హాజరయ్యేలా చేసేందుకు 'సేవ' నడుం బిగించింది. రామగుండం-3లో శ్రీమతి కళావతి వెంకటేశ్వరరావు (సేవ అధ్యక్షురాలు) సారధ్యంలో కార్మిక కుటుంబాలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం. ఇటువంటి కౌన్సిలింగులు దాదాపు అన్ని ఏరియాల్లోను సేవ సభ్యులు చేపట్టడం విశేషం

## జన స్పందన- అభినందన



"మీకేమైన సమస్యలున్నాయా?" అంటూ స్వయంగా ఉన్నతాధికారులే వచ్చి అడుగుతున్నప్పుడు కార్మికులకన్నా ఎక్కువగా వారి గృహిణిలే స్పందిస్తున్నారు. తమ సమస్యలు విన్నవించి పరిష్కరించుకోగలుగుతున్నారు. శ్రీరాంపూర్‌లో జరిగిన కార్మికుల వద్దకు యాజమాన్యం కార్యక్రమంలో జి.యం. శ్రీ సుగుణాకర్ రెడ్డికి సమస్యలు వివరిస్తున్న కార్మిక కుటుంబీకులు



సింగరేణి సంస్థ ఉత్పత్తిలోనే కాదు - క్రీడల్లోనూ జాతీయ స్థాయిలో విజయ పతాక ఎగురవేస్తుంది. ఇటీవల భువనేశ్వర్‌లో జరిగిన కోల్ ఇండియా స్థాయి క్యారమ్స్ పోటీలో టీమ్ ఛాంపియన్‌షిప్ సాధించిన సింగరేణి జట్టును అభినందిస్తున్న శ్రీ డి.యల్.ఆర్. ప్రసాద్, డైరెక్టర్, (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్సు). చిత్రంలో టీమ్ విజేతలు యం.డి. అఫ్జల్, డి. సంపత్, జి. మల్లయ్య డి. ప్రభాకర్‌తో శ్రీ మనోహర్‌రావు సి.జి.యం. (ఆర్.జి.-1), శ్రీ రాజేందర్‌రెడ్డి, జి.యం.ఆర్.జి.-2 ఉన్నారు.

# అభివృద్ధి పథంలో సింగరేణి...కొన్ని ప్రారంభోత్సవాలు

అభివృద్ధి పథంలో పురోగమిస్తున్న మన సంస్థలో కొత్త గనులు, కొత్త కాలనీలు, కొత్త కార్యాలయాల ప్రారంభం వంటి అనేక కార్యక్రమాలు ప్రతీ నెల ఏదో ఒకచోట జరుగుతూనే వున్నాయి. మన సంస్థ ఇదే విధంగా మరింత పురోగమించాలని, ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షిద్దాం

## కొత్త గనులు

బెల్లంపల్లి ఏరియాలో డోర్లి ఓపెన్‌కాస్ట్-1ని మన చైర్మన్ అండ్ యం.డి. శ్రీ యస్. నర్సింగ్‌రావు నవంబర్ 29న ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ డి.యల్.ఆర్. ప్రసాద్, డైరెక్టర్ (పి అండ్ పి) శ్రీ ఇ. రాజారావు డైరెక్టర్ (ఇ అండ్ యం) శ్రీ ఇ.వి. కృష్ణారెడ్డి, డైరెక్టర్ (ఫైనాన్స్), శ్రీ సి.వి. రెడ్డి, జి.యం. (బెల్లంపల్లి), శ్రీ వై. గట్టయ్య (ఎఐటియుసి), శ్రీ యం. శ్రీనివాస్ (టి.జి.బి.కె.ఎస్.) తదితరులు పాల్గొన్నారు.





బెల్లంపల్లి ఏరియాలో గొలేటి-1ఎ గనులో నవంబర్ 29న మ్యాన్ రైడింగ్ సిస్టమ్ ప్రారంభించిన మన చైర్మన్ అండ్ యం.డి. శ్రీ ఎస్. నర్సింగ్‌రావు

## మ్యాన్ రైడింగ్ సిస్టమ్‌లు

మన సంస్థ కార్మిక రక్షణ, సంక్షేమం దృష్టిలో ఉంచుకొని దాదాపు అన్ని గనుల్లోను మ్యాన్ రైడింగ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటి వరకు కంపెనీలో 37 మ్యాన్ రైడింగ్ సిస్టమ్స్‌లు ఏర్పాటు చేయడం జరిగింది. కోల్ ఇండియాలో కూడా ఇంత సంఖ్యలో మ్యాన్ రైడింగ్ సిస్టమ్‌లు లేవు



భూపాలపల్లి ఏరియాలో కెటికె-2 ఇంక్లైన్‌లో నవంబర్ 22న మ్యాన్ రైడింగ్ సిస్టమ్ ప్రారంభించిన మన డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీ జె.వి. దత్తత్రేయులు



రామగుండం-2 ఏరియాలో కొత్తగా నిర్మించిన మహాకవి పోతన కాలనీ క్వార్టర్లు

## కొత్త కాలనీలు

మన సంస్థ కార్మిక గృహవసతి కల్పనలో ఎంతో ముందుంది. ఇటీవల కాలంలో అనేక చోట్ల కొత్త తరహాలో విశాలమైన ఆధునిక క్వార్టర్ల నిర్మాణాన్ని కంపెనీ చేపట్టింది. మన కంపెనీలో డిసెంబర్ నాటికి క్వార్టర్ల సంఖ్య 45,444



డిసెంబర్ 23, సింగరేణి దినోత్సవంనాడు పోతన కాలనీని ప్రారంభించి, ప్రసంగిస్తున్న మన చైర్మన్ అండ్ యం.డి. శ్రీ ఎస్. నర్సింగ్‌రావు, కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ (పి అండ్ పి) శ్రీ డి.ఎల్.ఆర్. ప్రసాద్, గుర్తింపు కార్మిక సంఘం నాయకులు శ్రీ వి. సీతారామయ్య, ఆర్.జి.-2 జి.యం. శ్రీ సి.వి.రెడ్డి తదితరులు

## కొత్త సౌకర్యం

మన ఉద్యోగుల సౌకర్యార్థం సింగరేణి వ్యాప్తంగా గల సింగరేణి కాలరీస్ కన్స్యూమర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ స్టోర్స్ (సూపర్ బజార్ల)ను ఆధునీకరించే పనిని సంస్థ చేపట్టింది. తొలి దశగా కొత్తగూడెంలోని సూపర్ బజార్‌లో సూపర్ మార్కెట్‌ను నెలకొల్పారు దీనిని మన డైరెక్టర్ పా శ్రీ ఎల్. శశిధర్ అక్టోబర్ 14న ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సి.జి.యం. పర్సనల్ శ్రీ యం. గంగిరెడ్డి, ఎస్.ఓ. టు డైరెక్టర్ పా శ్రీ భానుప్రసాద్, గుర్తింపు కార్మిక సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



Printed & Published by : Dr. T.R.K. Rao, IRTS, Executive Director (MM,F&PR) on behalf of Singareni Collieries Company Ltd.
Singareni Bhavan, PB No. 18, Red Hills, Hyderabad-500 004 A.P. Printed at : Sai Likhitha Printers, Khairatabad, Hyderabad